ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY 3 వరంగల్
సోమవారం 12 ఆగస్టు 2024



నిండుకుండలా లక్నవరం సరస్సు



స్పీడ్‌బోట్‌లో విహరిస్తున్న పర్యాటకులు

ప్రకృతి పరవశం.. లక్నవరం..

ప్రకృతి అందాలకు నెలవైన లక్నవరం సరస్సు నిండుకుండలా మారింది. గోవిందరావుపేట మండలంలోని చెరువు మత్తడి పోస్తోంది. చుట్టూ కొండలు మధ్యలో ద్వీపంలా కనిపిస్తూ పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తోంది. జంట వంతెనలు కనువిందు చేస్తున్నాయి. పర్యాటకులు స్పీడ్ బోట్లలో విహరిస్తూ, సెల్ఫీలు దిగుతూ, ఊయలవంతెనపై పరవశించిపోతున్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లోని దూర ప్రాంతాలనుంచి వచ్చి సరస్సు మధ్యలో ఉన్న కాటేజీల్లో ఉంటూ ప్రకృతిని ఆస్వాదిస్తున్నారు.

– ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, భూపాలపల్లి



ఖరీఫ్‌కు భరోసా ఏదీ?!

వానాకాలం పంటలకు అందని పెట్టుబడి సాయం

- ఎన్నికల్లో సాయం పెంచి ఇస్తామని కాంగ్రెస్ హామీ
- రైతుల అభిప్రాయ సేకరణ పేరిట ఉపసంఘం ఏర్పాటు
- గత అసెంబ్లీ సమావేశాల్లోనూ చర్చించని ప్రభుత్వం
- కౌలు రైతులు, వ్యవసాయ కూలీలకు కరువైన భరోసా
- పెట్టుబడికి డబ్బులు లేక అన్నదాతల అవస్థలు
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 8,89,787 మంది రైతుల ఎదురుచూపులు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

రైతులకు పెట్టుబడి సాయంపై సందిగ్ధం నెలకొంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులకు ఏటా రెండు పంటలకు ఎకరాకు రూ.10వేల చొప్పున పెట్టుబడి సాయాన్ని రైతు బంధు పథకం పేరుతో అందించింది. అయితే కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీల్లో రైతు బంధును రైతు భరోసా పథకంగా మార్చి.. ఏటా ఎకరాకు రూ.15వేల సాయం అందిస్తామని ప్రకటించింది. ప్రభుత్వం రైతుభరోసా పథకాన్ని అర్హులైన వారికే అములు చేయాలని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నేతృత్వంలో మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ రైతుల అభిప్రాయాలను సేకరించినప్పటికీ ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో చర్చకు పెట్టకపోవటం పలు అనుమానాలకు తావిచ్చింది. రైతులతోపాటు కౌలు రైతులు, వ్యవసాయ కూలీలకు కూడా రైతుభరోసా పథకం ద్వారా సాయం అందిస్తామని ఆరుగ్యారంటీల్లో హామీ ఇవ్వటంతో ప్రభుత్వ నిర్ణయం కోసం అన్నదాతలు నిరీక్షిస్తున్నారు.

రైతుకు భరోసాకు గ్యారంటీ ఏది..?

కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీల్లో రైతు భరోసాను ప్రకటించింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రైతుబంధు పథకం కింద ఎకరాకు యాసంగి, వానాకాలం పంటలకు రెండు విడతల్లో రూ.10వేల ఆర్థిక సాయాన్ని రైతులకు అందించింది. అయితే తాము అధికారంలోకి వస్తే రైతుబంధు పథకం స్థానంలో రైతు భరోసా పథకాన్ని అమలు చేస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. భరోసా ద్వారా రైతులకు ఎకరాకు రెండు విడతల్లో రూ.15వేల పెట్టుబడి సాయం అందిస్తామని హామీ ఇచ్చింది. అలాగే కౌలు రైతులకు కూడా ఇదే మొత్తాన్ని అందిస్తామని హామీ ఇచ్చింది. ఇక వ్యవసాయ కూలీలకు ఏటా రూ.12వేల ఆర్థిక సాయాన్ని అందిస్తామని హామీ ఇచ్చింది. ఈ మేరకు గత డిసెంబరులో సీఎం రేవంత్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన తరువాత యాసంగి పంటలకు సంబంధించి పాత పద్ధతిలోనే రైతులకు యాసంగి పంటకు ఎకరాకు రూ.5వేల చొప్పున సాయాన్ని అందించారు. అయితే వానాకాలం పంటలకు కాంగ్రెస్ ఇచ్చిన రైతు భరోసా పథకం కింద ఎకరాకు రూ.15వేల చొప్పున ఇవ్వాల్సి ఉంది. అయితే భరోసా పథకంపై ప్రభుత్వం ఇప్పటి వరకు విధివిదానాలను ప్రకటించలేదు. పైగా గత ప్రభుత్వం అమలు చేసిన రైతుబంధు పథకంలో లోపాలు ఉన్నాయని, వాటిని సరిచేసేందుకు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నేతృత్వంలో మంత్రి వర్గ ఉపసంఘాన్ని నియమించింది. ఈ కమిటీ నేతృత్వంలోని మంత్రుల బృందం తెలంగాణలో ఉమ్మడి జిల్లా కేంద్రాల్లో పర్యటించింది. అందులో భాగంగా జూలై 15వ తేదీన ఉమ్మడి జిల్లా రైతుల అభిప్రాయాలను సేకరించేందుకు హనుమకొండ కలెక్టరేట్‌లో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. భట్టి విక్రమార్కతోపాటు మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వర్‌రావు, కొండా సురేఖ, సీతక్కలు హాజరయ్యారు. మెజారిటీ రైతులు 10ఎకరాల లోపు రైతులకే రైతు భరోసా సాయం అందించాలని సూచించారు. అయితే రైతుల అభిప్రాయాలను సేకరించిన మంత్రులు అసెంబ్లీ సమావేశాల్లో శాసన సభ్యుల అభిప్రాయలను కూడా తెలుసుకునేందుకు చర్చ పెడుతామని వరంగల్‌లో ప్రకటించారు. పార్టీలకు అతీతంగా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఇచ్చే సలహాలు తీసుకుని రైతుభరోసాను అమలు చేస్తామని హామీ ఇచ్చారు. అయితే ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో ఈ అంశం చర్చకు రాలేదు. దీంతో ఈసారి రైతుభరోసా పథకం ద్వారా పెట్టుబడి సాయం అందటం అనుమానంగా ఉందనే ఆందోళనలో రైతాంగం ఉంది.

పెట్టుబడి సాయం లేనట్టేనా..?

పదేళ్ల కాలంలో ఎప్పుడూ లేని విధంగా రైతులు ఈసారి పెట్టుబడికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వానాకాలం పంటలు ప్రారంభంలోనే ప్రభుత్వం రుణమాఫీ ప్రకటించింది. ఇప్పటికే తొలి విడతలో రూ.లక్ష, రెండో విడతలో రూ.లక్షన్నర రుణమాఫీని ప్రకటించింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రెండు విడతల్లో 2,08,077 రైతు ఖాతాలకు రూ.1,506.50కోట్ల రుణాన్ని ప్రభుత్వం మాఫీ చేసింది. ఇక రూ.2లక్షల రుణమాఫీ చేసేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఈ నేపథ్యంలో బ్యాంకులు రుణమాఫీ లెక్కల్లో బిజీగా మారటంతో కొత్త రుణాలు ఇచ్చేదుకు ఆసక్తి చూపటం లేదు. దీంతో బ్యాంకుల్లో కొత్తగా రుణాలు అందకపోవటంతోపాటు ప్రభుత్వం ఇచ్చే రైతు భరోసా పెట్టుబడిసాయం కూడా అందకపోవటంతో అన్నదాతలు అవస్థలు పడుతున్నారు. అదిక వడ్డీలకు ప్రైవేటు వ్యాపారుల నుంచి పంటల సాగుకు పెట్టుబడికి అప్పులు చేయాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు. కాగా, 2023-24లో ఉమ్మడి వరంగల్ జిల్లాలో 8,89,787మంది రైతులకు గత యాసంగిలో రైతుభరోసా సాయం అందింది. జూన్‌లోనే రైతులకు వానాకాలం పంటలకు పెట్టుబడిసాయం అందించాల్సి ఉంది. ఆగస్టులో కూడా రైతుభరోసా ఇవ్వకపోవటంతో పంటలకు పెట్టుబడి కష్టాలు తీవ్రం అవుతున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.

అయితే ప్రభుత్వం రైతుభరోసాపై విధివిధానాలు ప్రకటించకపోవటంతో పెట్టుబడిసాయం ఆలస్యం అవుతుందని అధికారులు పేర్కొంటున్నారు. ప్రభుత్వం ప్రకటించే కొత్త విధానంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న రైతుల్లో ఎంత మందికి పెట్టుబడి సాయం వస్తుందో అనే ఉత్కంఠలో ఉన్నారు.

గత యాసంగిలో రైతు భరోసా పొందిన రైతులు

జిల్లా	లబ్ధిపొందిన రైతులు
వరంగల్	1,54,822
హనుమకొండ	1,45,044
జనగామ	1,79,735
మహబూబాబాద్	2,14,685
భూపాలపల్లి	1,16,171
ములుగు	79,330
మొత్తం	8,89,787

కౌలురైతులు, కూలీల గుర్తింపు ఎప్పుడో..?

కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీల్లో రైతుభరోసా పథకంలో రైతులతో పాటు కౌలు రైతులకు, వ్యవసాయ కూలీలకు కూడా పెట్టుబడి సాయం అందిస్తామని ప్రకటించింది. ఈ మేరకు రైతుల నుంచి మంత్రివర్గ ఉపసంఘం సేకరించిన అభిప్రాయాల్లో పలువురు కూలీలకు, కౌలు రైతులకు ఏ విధంగా సాయం అందిస్తారని మంత్రులను ప్రశ్నించారు. అయితే వీటిపై ప్రభుత్వం విధివిధానాలు ఖరారు చేస్తుందని మంత్రులు తెలిపారు. ఇప్పటి వరకు ప్రభుత్వం కౌలు రైతులను గుర్తించే ప్రక్రియ చేపట్టలేదు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సుమారు 2లక్షలకుపైగా కౌలు రైతులు ఉన్నట్లుగా అనధికారికంగా లెక్కలు ఉన్నాయి. అధికారికంగా గుర్తింపు ప్రక్రియ చేపడితే ఈ సంఖ్య పెరగటమో.. తగ్గటమో జరుగుతుంది. అయితే కౌలు రైతులకు రైతుభరోసా కింద సాయం అందిస్తే... పట్టాదారుడైన రైతులకు కూడా సాయం అందుతుందా లేదా అనేది ప్రశ్నార్థకంగా మారింది. అలాగే ఉమ్మడి వరంగల్ జిల్లాలో వ్యవసాయ కూలీలు ఐదు లక్షలకు పైగా ఉన్నట్లుగా అంచనా.

అయితే వ్యవసాయ కూలీలను ఏ ప్రాతిపాదికన గుర్తిస్తారో అనేది కూడా ప్రభుత్వం స్పష్టం చేయలేదు. అటు కౌలు రైతులు, ఇటు వ్యవసాయ కూలీల గుర్తింపు ప్రక్రియను ప్రభుత్వం చేపట్టక పోవటంతో ఈ వానకాలం పంటలకు రైతు భరోసా అందటంపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.



ఫ్లాట్‌ఫాంపై ఉన్న ప్రయాణికుల బ్యాగులు తనిఖీ చేస్తున్న సీపీ అంబర్ కిషోర్ ఝా


వరంగల్ రైల్వేస్టేషన్‌లో సీపీ తనిఖీలు

- ప్రయాణికుల సమస్యలు, వివరాల ఆరా
- తినుబండారాలు, స్టాళ్ల పరిశీలన
- నాణ్యమైనవి అమ్మాలని నిర్వాహకులకు సూచన

గిర్మాజీపేట, ఆగస్టు11 : వరంగల్ మహానగరంలో శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా వరంగల్ పోలీసు కమిషనర్ అంబర్ కిషోర్ ఝా శనివారం అర్ధరాత్రి వరంగల్ రైల్వేస్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీసు సిబ్బందితో వరంగల్ రైల్వేస్టేషన్‌కు చేరుకున్న పోలీసు కమిషనర్ ముందుగా మొదటి ఫ్లాట్‌ఫాంపై నిద్రిస్తున్న, మెళకువతో ఉన్న ప్రయాణికులతో మాట్లాడి వారి వివరాలు తెలుసుకున్నారు. ప్రయాణ వివరాలను ఆరా తీశారు. సీపీ వెంట ఉన్న సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు గోపి, శివకుమార్, ఆర్.ఐ శ్రీనివాస్‌లు ప్రయాణికుల లగేజీలు, బ్యాగులు తెరిపించి తనిఖీచేశారు. అనుమానాస్పదంగా కనిపించిన వ్యక్తుల వివరాలను క్షుణ్ణంగా తెలుసుకున్నారు. అలాగే ఫ్లాట్‌ఫారాలపై ఉన్న తినుబం డారాల స్టాల్స్‌కు వద్దకు వెళ్లారు. ఆయా స్టాల్స్‌లో విక్రయిస్తున్న బిస్కెట్‌లు, చాక్లెట్‌లు, చిన్నారులు ఇష్టంగా తినే చిప్స్, తదితర తినుబండారాలను స్వ యంగా చేతిలో తీసుకుని వాటిని పరిశీలించారు. చాక్లెట్లను బాక్స్‌ల నుంచి తెరిపించి వాటిని క్షుణ్ణంగా పరిశీలి ంచారు. ప్రయాణికులకు నాణ్యమైన తిను బండారాలు రైల్వేశాఖ నిర్దేశించిన రేట్ల ప్రకారమే విక్రయించాలని, ఎలాంటి తప్పుడు తినుబండారాలు విక్రయిస్తే చట్టప్రకారం శిక్షలుంటాయని సీపీ స్టాల్స్ సిబ్బందిని హెచ్చరించారు. రైల్వేస్టేషన్‌లోని నాలుగు ప్లాట్‌ఫారాలను తనిఖీచేసిన సీపీ పోలీసు బృందంతో శివనగర్ వైపు సైతం తనిఖీచేశారు. ప్రయాణికులకు పలు జాగ్రత్తలు, సూచనలు చేశారు.

శివనగర్‌లో భారీ చోరీ

- విశ్రాంత ఉద్యోగి ఇంట్లో చొరబడిన దొంగలు
- 20 తులాల బంగారం, రూ. 15వేలు అపహరణ
- విచారణ చేస్తున్న మిల్స్ కాలనీ పోలీసులు




చోరీ జరిగిన ఇంటి పరిసర ప్రాంతాల్లో డాగ్ స్క్వాడ్ సిబ్బంది తనిఖీ చేపడుతున్న దృశ్యం

కరీమాబాద్, ఆగస్టు 11: వరంగల్ శివనగర్‌లోని ఓ ఇంట్లో శనివారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీ కి పాల్పడ్డారు. 20 తులాల బంగారు ఆభరణాలు, రూ.15వేల నగదును అపహరించారు.. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శివనగర్ ప్రాంతానికి చెందిన కొత్తగట్టు నర్సింహమూర్తి-వెంకటలక్ష్మి దంపతులు శివనగర్‌లో నివాసముంటున్నారు. నర్సింహమూర్తి ఇరిగేషన్ శాఖలో పనిచేసి రిటైర్డ్ అయ్యాడు. నర్సింహమూర్తికి అనారోగ్యంగా ఉండడంతో గత సోమవారం హైదరాబాద్‌లో ఉన్న పెద్దకూతురు ఇంటికి వెళ్లి వారం రోజులు అక్కడే ఉంటూ చికిత్స తీసుకుంటున్నాడు. చికిత్స పొందిన తరువాత ఆదివారం తిరిగి వరంగల్ శివనగర్‌లోని తమ నివాసానికి చేరుకున్నారు. దంపతులు ఇద్దరు ఇంట్లోకి వెళ్లి చూసే సరికి ఇంట్లోని బీరువా తెరిచి ఉండటాన్ని గమనించి చూడగా అందులో ఉన్న సుమారు బంగారు ఆభరణాలు, రూ.15వేల నగదు కనిపించలేదు. దీంతో ఇంట్లో దొంగలు పడ్డారని నిర్ధారణకు వచ్చిన నర్సింహమూర్తి దంపతులు.. 100కి డయల్ చేశారు.

సమాచారం తెలుసుకున్న మిల్స్‌కాలనీ సీఐ పి.మల్లయ్య, ఎస్సైలు, ఇతర పోలీసు సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని క్లూస్‌టీం, డాగ్‌స్క్వాడ్ సిబ్బంది ఆధ్వర్యంలో ఆధారాలు సేకరించారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మిల్స్‌కాలనీ పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా అండర్ రైల్వేగేటు ప్రాంతంలో దొంగలు తమ చేతివాటాన్ని చూపిస్తూ, మిల్స్‌కాలనీ పోలీసు స్టేషన్ పరిధిలో వరుస దొంగతనాలకు పాల్పడుతూ పోలీసులకు కంటిమీద కునుకులేకుండా చేస్తున్నారు. వరుస దొంగతనాలతో స్థానికులు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు.

కమిషనరేట్‌లో 9మంది సీఐల బదిలీ



వరంగల్ క్రైం, ఆగష్టు 11: వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో తొమ్మిది మంది సీఐలను బదిలీ చేస్తూ ఆదివారం కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీ అయినవారిలో బి.రాజగోపాల్ దుగ్గొండి నుంచి పర్వతగిరికి, వి.చేరాలు వీఆర్ నుంచి హసన్‌పర్తికి, జె.సురేష్‌కుమార్ హసన్‌పర్తి నుంచి ఎస్‌బీకి, పి.కిషన్ ఎస్‌బీ నుంచి మడికొండకు, డి.ప్రతాప్ మడికొండ నుంచి ఎస్‌బీకి, కె.శ్రీనివాస్ ఎస్‌బీ నుంచి వర్ధన్నపేటకు, జి.సూర్యప్రకాశ్ వర్ధన్నపేట నుంచి ఐజీపికి సరెండర్, పులి రమేశ్ వీఆర్ నుంచి ఎల్కతుర్తికి, ఎ.రాఘవేందర్ ఎస్‌బీ నుంచి ఏనుమాముల పీఎస్‌కు బదిలీ అయ్యారు.

పర్వతగిరి సీఐ, వీఆర్ ఎస్ఐ సస్పెన్షన్

- పంథినిలో క్వారీ కేసు విషయంలో అవినీతి ఫలితం
- విచారణ చేసి వేటు వేసిన సీపీ



సీఐ శ్రీనివాస్ నాయక్ | ఎస్ఐ అనిల్‌కుమార్

వరంగల్ క్రైం, ఆగష్టు 11: గ్రానైట్ కంపెనీపై నమోదైన కేసు విషయంలో అవినీతికి పాల్పడిన వరంగల్ జిల్లా పర్వతగిరి సీఐ ఇ.శ్రీనివాస్ నాయక్, ఎస్ఐ జి.అనిల్ కుమార్‌పై సస్పెన్షన్ వేటు పడింది. ఈ మేరకు ఆదివారం వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఉత్తర్వులు జారీ చేశారు. మార్చి 28న ఐనవోలు మండలం పంథిని సమీపంలోని ఒక గ్రానైట్ కంపెనీలో రూ.30లక్షలకు పైగా విలువ చేసే డీజిల్ నిల్వ ఉన్నట్లు టాస్క్‌ఫోర్స్ పోలీసులకు సమాచారం అందింది. వెంటనే దాడులు చేసి నిర్వాహకుడిని విచారణ నిమిత్తం స్థానిక పోలీ స్‌స్టేషన్‌కు అప్పగించారు. విచారణలో భాగంగా సీఐ శ్రీనివాస్ నాయక్‌తో పాటు ఆ సమయంలో ఐనవోలు ఎస్ఐగా చేసిన అనిల్‌కుమార్ అవినీతికి పాల్పడినట్లు ఆరోపణలు రావడంతో సీపీ విచారణకు ఆదేశించారు. విచారణలో సీఐ, ఎస్ఐ ఇద్దరు అవినీతికి పాల్పడినట్లు తేలడంతో సస్పెండ్ చేశారు. కాగా, ఇటీవల పర్వతగిరి ఎస్ఐపై జరిగిన ఏసీబీ దాడి విషయంలో సైతం సీఐపై ఆరోపణలు వచ్చినట్లు తెలిసింది. బెల్లం వ్యాపారం చేసే వారి నుంచి డబ్బులు తీసుకుంటూ ఎస్ఐ వెంకన్న ఏసీబీకి పట్టుబడిన విషయం తెలిసిందే. సీఐ సస్పెన్షన్ వెనుక గ్రానైట్ కంపెనీ కేసుతోపాటు పర్వతగిరిలో జరిగిన సంఘటన కూడా తోడైనట్లు సమాచారం. మొత్తంగా సీఐ, ఎస్ఐ సస్పెన్షన్ పోలీస్‌శాఖలో హాట్ టాపిక్‌గా మారింది. కాగా, సస్పెన్షన్ వేటు పడిన ఎస్ఐ అనిల్‌కుమార్ ప్రస్తుతం వీఆర్‌లో ఉన్నాడు.



మాట్లాడుతున్న హీరో రామ్ | హీరోయిన్ కావ్య

'డబుల్ ఇస్మార్ట్' జోష్

- ఇండోర్ స్టేడియంలో సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్
- హాజరైన హీరో రామ్, డైరెక్టర్ పూరి, హీరోయిన్ కావ్య

బాలసముద్రం, ఆగస్టు 11: రామ్ పోతినేని హీరోగా, కావ్య హీరోయిన్‌గా, పూరి జగన్నాథ్ దర్శకత్వంలో రూపొందిన డబుల్ ఇస్మార్ట్ సినిమా ప్రీ రిలీజ్ ఫంక్షన్ ఆదివారం హనుమకొండ బాలసముద్రంలోని జేఎన్ఎస్ ఇండోర్ స్టేడియంలో జరిగింది. ఈ సందర్భంగా డైరెక్టర్ పూరి జగన్నాథ్ మాట్లాడుతూ.. ఈనెల 15న డబుల్ ఇస్మార్ట్ సినిమా విడుదల చేస్తున్నట్లు తెలిపారు. సినిమా కోసం కృషి చేసిన సిబ్బందికి డైరెక్టర్ పూరి జగన్నాథ్ కృతజ్ఞతలు తెలిపారు. హీరో రామ్ మాట్లాడుతూ.. ఐదేళ్ల కిందట వరంగల్‌లోనే ఇస్మార్ట్ శంకర్ సినిమా ప్రీ రిలీజ్ జరిగిందన్నారు. ఆ సినిమా సూపర్ హిట్ కొట్టిందని అన్నారు. డబుల్ ఇస్మార్ట్ సినిమా కోసం ఎంతో కష్టపడినట్లు రామ్ తెలిపాడు. ఆగస్టు 15న సినిమా రిలీజ్ రోజు థియేటర్‌లో కలుసుకుందామని అభిమానులకు తెలిపాడు. కాగా, ఈ కార్యక్రమానికి అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. హీరో రామ్ పోతినేని, నటుడు అలీ, నిర్మాత చార్మి మాట్లాడుతుండగా అభిమానులు కేరింతలతో స్టేడియం దద్దరిల్లింది.

ఈ కార్యక్రమంలో యంకర్ సుమ ఇస్మార్ట్ డైలాగులతో ఆకట్టుకున్నారు. హనుమకొండ ఏసీపీ దేవేందర్‌రెడ్డి, సుబేదారి సీఐ సత్యనారాయణరెడ్డి పోలీసు సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.

బోనాల పండుగలో కోడిపుంజు సందడి



కేసముద్రం(మహబూబాబాద్ జిల్లా), ఆగస్టు 11: బోనాల పండుగలో మొక్కులు సమర్పించేందుకు కోడిపుంజును తీసుకువెళ్లడం సాధారణం. ఇందుకు భిన్నంగా కోడిపుంజుకు బుట్టాలు, మద్యం సీసాతో అలంకరించి ఊరేగింపుగా తీసుకువెళ్లడం ఆకర్షణీయంగా మారింది. మహబూబాబాద్ జిల్లా కేసముద్రంస్టేషన్ లక్ష్మీనగర్‌కు చెందిన తోడేటి వెంకన్న పదేళ్లుగా కోడిపుంజును ఇలాగే అలంకరించి తీసుకువెళుతున్నాడు. ఆదివారం నిర్వహించిన బోనాల్లో ఈ కోడిపుంజు ఆకర్షణీయంగా ఉండడంతో పలువురు యువకులు కోడితో ఫొటోలు దిగడం విశేషం.

రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ పోటీల్లో ప్రతిభ



బ్యాడ్మింటన్ విజేతలను అభినందిస్తున్న రాష్ట్ర నాయకులు

వరంగల్ కార్పొరేషన్, ఆగస్టు 11: హైదరాబాద్‌లోని గోపీచంద్ బ్యాడ్మింటన్ అకాడమీలో ఈ నెల 8 నుంచి 11 వరకు జరిగిన యోనెక్స్ 10వ తెలంగాణ రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్స్ అండర్ 13 బ్యాడ్మింటన్ పోటీలలో గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ ఇండోర్ స్టేడియంలో ప్రాక్టీస్ చేస్తున్న క్రీడాకారులు సత్తా చాటారు. సింగిల్స్, డబుల్స్ విభాగంలో బాలురు ప్రతిభ కనబరిచినట్టు కోచ్ శ్రీధర్ ఆదివారం తెలిపారు. సింగిల్స్, డబుల్స్ విభాగంలో శ్రీచేతన్, శౌర్య శ్యామల ద్వితీయ స్థానంలో నిలిచి సిల్వర్ మెడల్స్ సాధించారు. రాష్ట్ర స్థాయిలో సత్తా చాటిన క్రీడాకారులను రాష్ట్ర బ్యాడ్మింటన్ అసోసియేషన్ నాయకులు అభినందించారు.

రాయపర్తిలో దారి దోపిడీ

రాయపర్తి, ఆగస్టు 11 : వరంగల్ జిల్లా రాయ పర్తి మండల కేంద్రంలోని వరంగల్ ఖమ్మం జాతీయ రహదారిపై దంపతులు దారి దోపిడీకి గురైన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు, బాధితుల కథనం ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా పెద్దవంగర మండలంలోని వడ్డె కొత్తపల్లి గ్రామానికి చెందిన సాయిని భవిత-వెంకన్న దంపతులు తమ కూతురు పుట్టిన రోజు సందర్భంగా చూసేందుకు హనుమకొండ జిల్లా ఐనవోలు మండలంలోని పున్నేలు క్రాస్ రోడ్డు వద్ద ఉన్న ఏకశిల స్కూల్‌కు ద్విచక్ర వాహనంపై వచ్చారు. అనంతరం తిరిగి రాయపర్తి మీదుగా ఇంటికి వెళ్తుండగా, రాయపర్తి శివారులోని డబుల్ బెడ్‌రూం ఇళ్ల సమీపంలో జాతీయ రహదారిపై ఓ గుర్తు తెలియని వ్యక్తి ఓ ద్విచక్ర వాహనంపై హెల్మెట్ ధరించి స్పీడుగా వచ్చి, బైక్ పై వెనక కూర్చున్న భవిత చేతిలో ఉన్న హ్యాండ్ బ్యాగును లాగేసి ఎత్తుకెళ్లాడు. దీంతో దంపతులు వెంబడించినప్పటికీ అతడి అచూకీ లభించలేదు. అనంతరం రాయపర్తి పోలీస్ స్టేషన్‌కు చేరుకుని ఫిర్యాదు చేశారు. హ్యాండ్ బ్యాగులో 15 గ్రాముల బంగారం, రూ.2వేల నగదు ఉన్నట్లు తెలిపారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అంబేద్కర్ ఓపెన్ వర్సిటీ ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ జ్యోతి

వరంగల్ ఎడ్యుకేషన్, ఆగస్టు 11: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో డిగ్రీ, పీజీ ప్రవేశాల కోసం దరఖాస్తులు చేసుకోవాల్సిందిగా ప్రాంతీయ సంచాలకులు ప్రొఫెసర్ సుంకరి జ్యోతి కోరారు. ఆదివారం ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ చాంబర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. ఈనెల 31 వరకు దరఖాస్తులు చేసుకునేందుకు అవకాశం ఉందన్నారు. అన్ని వివరాలకు www.braouonline.in, www.braou.ac.in వెబ్‌పోర్టల్లలో చూడాలన్నారు. ఇతరత్ర ఏవైనా సందేహాలుంటే 7382929570/580 హెల్ప్ డెస్క్ నెంబర్లలో సంప్రదించాలన్నారు. అలాగే 2015 నుంచి 2024 వరకు ఫీజు చెల్లించని డిగ్రీ, పీజీ ఓల్డ్ విద్యార్థులు ఆగస్టు 18 లోపు ట్యూషన్ ఫీజు చెల్లించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ పుల్లా రమేష్, డాక్టర్ చారి, డాక్టర్ గిరిప్రసాద్, డాక్టర్ నహిదాపర్వీన్ పాల్గొన్నారు.

తెలంగాణలో వీఆర్వో వ్యవస్థ మళ్లీ వస్తుంది

- కొత్త ఆర్వోఆర్ చట్టంతో రైతులకు న్యాయం
- గత ప్రభుత్వపు చీకటి ఒప్పందాల చట్టంతో రైతులకు తీవ్రమైన నష్టం
- తెలంగాణ డిప్యూటీ కలెక్టర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామకృష్ణ



ఆర్వోఆర్ చట్టం ముసాయిదా బిల్లు చర్చలో మాట్లాడుతున్న రామకృష్ణ

వరంగల్ వ్యవసాయం, ఆగస్టు 11: తెలంగాణలో గత పాలకుల నిలకడ లేని నిర్ణయాల వల్ల కనుమరుగైన వీఆర్వో వ్యవస్థ మళ్లీ రాష్ట్రంలో వస్తుందని తెలంగాణ డిప్యూటీ కలెక్టర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి రామకృష్ణ వెల్లడించారు. హనుమకొండలోని వరంగల్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశం మందిరంలో తెలంగాణ తహసీల్దార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం రెవెన్యూ ముసాయిదా బిల్-2024పై చర్చ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రామకృష్ణ మాట్లాడుతూ గత పాలకులు వైఫల్యంతో రాష్ట్రంలో రెవెన్యూ వ్యవస్థ నిర్వీర్యమయ్యిందన్నారు. కొత్త చట్టం అమల్లోకి వస్తే గ్రామానికో రెవెన్యూ అధికారి రానున్నారన్నారు. కొత్త రెవెన్యూ చట్టంతో రైతులకు, ప్రజలకు మెరుగైన సేవలు అందనున్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రాజ్యాంగం తరహాలో కొత్త ఆర్వోఆర్ చట్టాన్ని రూపొందించిందని కొనియాడారు. స్వాధీనంలో భూమి, చేతిలో పట్టా, రికార్డులో పేరు ఈ మూడు ఉన్నప్పుడే ఏ రైతుకైనా సంపూర్ణ హక్కులు దక్కుతాయని తెలిపారు. కొత్త ఆర్వోఆర్ చట్టంలో ఈ మూడు అంశాలుండడంతో రైతుకు భూమిపై సర్వ హక్కులు దక్కుతాయన్నారు.

కొత్త చట్టంతో రైతులకు సేవలు సులభంగా అందడంతో పాటు రెవెన్యూ వ్యవస్థ బలోపేతం అవుతుందన్నారు. ఈ చట్టంలో పరిస్థితులకు అనుగుణంగా నిబంధనలు మార్చుకునే వెసులుబాటును కల్పించారని తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన రెవెన్యూ చట్టంతో సామాన్య రైతులకు తహసీల్దార్, ఆర్డీవో, జాయింట్ కలెక్టర్ల పరిధిలో సమస్యల పరిష్కారానికి ఆస్కారం లేకుండా ఉండేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అయితే నూతన ఆర్వోఆర్ చట్టంతో రైతులు తమ భూ సమస్యలకు కోర్టు మెట్లు ఎక్కకుండానే అన్ని రకాల సేవలు అందనున్నాయన్నారు. ఎక్కడికక్కడ వారి సమస్యలను పరిష్కరించే అవకాశాన్ని కొత్త చట్టం కల్పించిందన్నారు. దీంతో రాష్ట్రంలోని రైతులకు వారి భూముల విషయంలో ఎలాంటి నష్టం వాటిల్లే ప్రమాదాలు తప్పనున్నాయని పేర్కొన్నారు. తెలంగాణ తహసీల్దార్ అసోసియేషన్ వరంగల్ జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు మహ్మద్ ఇక్బాల్ మాట్లాడుతూ... దేశంలోని 18 రాష్ట్రాల్లోని రెవెన్యూ చట్టాలను సమగ్రంగా అధ్యయనం చేసి, పరిశీలించి నూతన రెవెన్యూ చట్టాన్ని తీసుకొచ్చారన్నారు. గత ప్రభుత్వం మాదిరిగా చీకటి ఒప్పందాల ప్రకారం కాకుండా ప్రజల అభిప్రాయాల మేరకు ప్రజల ముందుకు నూతన ఆర్వోఆర్ చట్టం ముసాయిదా బిల్లును తీసుకువచ్చిన ప్రభుత్వానికి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణలో ప్రజాపాలన కొనసాగిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రైతులకు న్యాయం చేయాలనే కృతనిశ్చయంతోనే సబ్బండ వర్గాల అభిప్రాయలను సేకరించి అన్ని పరిశీలించి ప్రజలకు, రైతులకు అనువైన, ఉద్యోగులకు సులువైన మార్గాలను అన్వేషించి నూతన చట్టాన్ని రూపొందించిన ఘనత రేవంత్‌రెడ్డికే దక్కుతుందన్నారు.

జనరల్ సెక్రెటరీ పూల్‌సింగ్ చౌహాన్ మాట్లాడుతూ... నూతన ఆర్వోఆర్ చట్టంతో రైతులకు సులువుగా సేవలు అందుతాయన్నారు. క్షేత్ర స్థాయిలో భూపరిపాలన వ్యవస్థలోని సమస్యలను పరిష్కరించేందుకు కొత్త చట్టం ఉపయోగపడుతుందన్నారు. ప్రజల వద్ద నుంచే చట్టం రావాలనే ఉద్దేశంతో ప్రభుత్వం కొత్త చట్టం ముసాయిదాను పబ్లిక్ డొమైన్‌లో పెట్టారన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రమేష్, ఆదర్శ లా కళాశాల ప్రిన్సిపాల్ బూర విద్యాసాగర్, ఆర్టీఐ కార్యకర్త పొట్లపల్లి రవీందర్ తదితరులు పాల్గొని కొత్త ఆర్వోఆర్ చట్టంపై వారి వారి అభిప్రాయాలను వెల్లడించారు. ఈ కార్యక్రమంలో టీజీటీఏ సెక్రటరీ పాక రమేష్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ విక్రమ్‌కుమార్‌తో పాటు వరంగల్, హనుమకొండ, జయశంకర్ భూపాలపల్లి, జనగామ, మహబూబాబాద్, ములుగు తదితర జిల్లాల నుంచి పెద్ద ఎత్తున తహసీల్దార్లు, రెవెన్యూ ఉద్యోగులు, రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్లు పాల్గొన్నారు.

కర్షకుల వద్దకే కరెంటోళ్లు

- సత్ఫలితం 'ఎన్‌పీడీసీఎల్ పొలంబాట'
- అక్కడికక్కడే కరెంట్ సమస్యల పరిష్కారం
- విద్యుత్ కార్యాలయాల్లో కన్స్యూమర్ రిసెప్షన్ డెస్క్‌లు
- ప్రతీ సోమవారం విద్యుత్ ప్రజావాణి
- మెరుగైన కరెంట్ సరఫరాకు పలు సంస్కరణలు
- తొలగుతున్న ఇబ్బందులు.. రైతుల నుంచి స్పందన..

హనుమకొండ, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ సంస్థ మెరుగైన సేవలు అందించేందుకు పలు కార్యక్రమాలను చేపడుతోంది. వినియోగదారుల సమస్యల సత్వర పరిష్కారంతో పాటు ఉద్యోగుల్లో జవాబుదారీతనం తీసుకువచ్చే దిశగా పలు సంస్కరణలు తీసుకువచ్చారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం వ్యవధిని కనిష్ఠ స్థాయికి తీసుకురావడంతో పాటు వైఫల్యాల స్థాయిని కూడా సాధ్యమైనంత మేరకు తగ్గించేందుకు కృషి చేస్తున్నారు. ఇందుకు మానిటరింగ్ సెల్‌ను ఏర్పాటు చేసి ఫీడర్ల వైఫల్యాలు, విద్యుత్ సరఫరాలో అంతరాయం వ్యవధితో పాటు రోజులో ఎన్ని సార్లు పోతుందో కారణాలు నమోదు చేస్తున్నారు. అవి పునరావృతం కాకుండా తీసుకోవలసిన చర్యలు కొనసాగుతున్నాయి. విద్యుత్ సమస్యలపై ఫిర్యాదులు స్వీకరించడానికి విద్యుత్ ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రతీవారం నిర్వహిస్తున్నారు. కన్స్యూమర్ రిసెప్షన్ డెస్క్‌లను ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా కొత్తగా పొలాల వద్దకే విద్యుత్ అధికారులు వెళ్లే పొలంబాట కార్యక్రమాన్ని బుధవారం నుంచి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్నారు.

కన్స్యూమర్ రిసెప్షన్ డెస్క్

క్షేత్రస్థాయిలో వినియోగదారులకు సేవలు అందించే సెక్షన్ కార్యాలయాలకు వినియోగదారుడు వెళ్లే వారి సమస్య అడిగి తెలుసుకోవడానికి సరైన వ్యవస్థ లేదు. సెక్షన్ అధికారైనా ఏఈ ఉంటేనే సమస్యను నివేదించేవారు. సబ్ ఇంజనీర్లు, క్షేత్రస్థాయి సిబ్బంది ఉన్నా ఏఈ లేరంటూ వినియోగదారుడికి చెప్పి పంపించేవారు. ఈ దుస్థితిని నివారించడానికి ప్రస్తుతం కన్స్యూమర్ రిసెప్షన్ డెస్క్‌ను ఏర్పాటు చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు కార్యాలయ వేళల్లో ఏఈ, సబ్ ఇంజనీర్ అందుబాటులో ఉండి, వినియోగదారుల సమస్యలను స్వీకరించి రశీదులు జారీ చేయాల్సి ఉంటుంది. ఇదే విధానాన్ని సబ్ డివిజన్, డివిజన్, ఎస్ఈ కార్యాలయాల్లో అందుబాటులోకి తీసుకువచ్చారు. దీంతో వినియోగదారుడికి సమయం, శ్రమ, ఖర్చు ఆదా అవుతున్నాయి. ఇదే సమయంలో సమస్యకు సత్వర పరిష్కారం లభించే అవకాశాలు మెరుగుపడ్డాయి.

పొలం బాట

గ్రామాల్లో రైతులకు మెరుగైన విద్యుత్ సరఫరా కోసం ఎన్‌పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి ఓ కొత్త కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారు. దానిపేరు విద్యుత్ అధికారులు పొలం బాట. రైతులు విద్యుత్ సమస్యలను తెలుసుకొని అక్కడికక్కడే పరిష్కరించేందుకు ఉద్దేశించిన ఈ వినూత్న కార్యక్రమం ఎన్‌పీడీసీఎల్ పరిధిలోని పదహారు జిల్లాలో అమలులోకి వచ్చింది. ఉమ్మడి వరంగల్‌లోని హనుమకొండ, వరంగల్, జనగామ, మహబూబాబాద్, ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో నాలుగు రోజులుగా పొలం బాట పడుతున్నారు. కరెంట్ సమస్యపై రైతులను అడిగి తెలుసుకుంటున్నారు. వారి సమక్షంలోనే పరిష్కరిస్తున్నారు. అవసరమైతే వారి సహాయాన్ని కూడా తీసుకుంటున్నారు. వర్షాకాలంలో కరెంట్ సమస్యలు అధికంగా ఉంటాయి. దీనిని దృష్టిలో పెట్టుకొని సీఎండీ ఈ పొలంబాట కార్యక్రమాన్ని చేపట్టారు. ఇది పక్షం రోజుల పాటు కొనసాగుతోంది. అవసరమైతే ఆ తర్వాత కూడా మరికొన్ని రోజులు కొనసాగించే అవకాశం ఉంది.

సత్వరం పరిష్కారం

అన్నం పెట్టే అన్నదాతకు సమస్య వస్తే పనులు మానుకోవలసిన పరిస్థితిని విద్యుత్ అధికారుల పొలం బాట కార్యక్రమం నివారిస్తోంది. విద్యుత్ సంస్థ అధికారులైన ఎస్‌సీ, డీఈ, ఇతర సిబ్బంది ఉమ్మడి జిల్లాలో బుధవారం నుంచి పొలం బాట నిర్వహిస్తున్నారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకుంటున్నారు. విద్యుత్ సమస్యలను తమ దృష్టికి తీసుకురావడానికి అధికారులు విద్యుత్ లైన్‌మెన్, లైన్ ఇన్స్‌పెక్టర్ నెంబర్లను ఎన్‌పీడీసీఎల్ టోల్ ఫ్రీ నెంబరును అందచేస్తున్నారు. విద్యుత్ ప్రమాదాల పట్ల జాగ్రత్తలు వివరిస్తున్నారు. మోటార్ దగ్గర ఎర్తింగ్ సరిగా ఉందో లేదో చూస్తున్నారు. సర్వీస్ వైర్ అతుకులు లేకుండా చూస్తున్నారు. ఇనుప డబ్బాలు వాడకూడదని, ఇండక్షన్ వచ్చే ప్రమాదం ఉందని, కనుక ప్లాస్టిక్ డబ్బాలు వాడాలని సూచిస్తున్నారు. రైతుల చేతులు సర్వసాధారణంగా నీళ్లతో తడిగా ఉంటాయి. కనుక పొడి చేతులతో మోటార్ ఆన్ చేసేట్లు లేదా ఏదైనా ప్లాస్టిక్ పరికరం లేదా కర్ర తో చేసేట్లు జాగ్రత్తలు చెబుతున్నారు. డీఎస్ఎంలో భాగంగా ఐఎస్ ఐ నాణ్యత గల మోటార్లు తక్కువ రాపిడి ఇచ్చే పైపులు, బ్రాం డెడ్ ఫుట్‌వాల్వ్‌లు మొదలైన పరికరాలు నాణ్యమైనవాటినే వాడా లని సూచిస్తున్నారు.



దామెర మండలంలోని దుర్గంపేటలో పొలంబడి కార్యక్రమంలో పాల్గొన్న ఎన్‌పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి

విద్యుత్ ప్రజావాణి

ప్రతీ సోమవారం కలెక్టర్ నేతృత్వంలో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమం స్ఫూర్తితో ఎన్‌పీడీసీఎల్ విద్యుత్ ప్రజావాణి కార్యక్రమాన్ని చేపట్టింది. గతంలో కరెంట్ సమస్యలపై వినియోగదారుల నుంచి ఫిర్యాదులు తీసుకొని రశీదులు ఇచ్చేవారు కాదు. పరిష్కారం ఏదశలో ఉందో తెలుసుకోవడానికి వినియోగదారులు కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వచ్చేంది. వినియోగదారుడు కార్యాలయానికి వచ్చిన సమయంలో అధికారి అందుబాటులో ఉండేవాడు కాదు. ఫిర్యాదు పుస్తకం దొరికేది కాదు.

ఈ సమస్యను పూర్తిగా తొలగించేందుకు సెక్షన్, సబ్ డివిజన్, డివిజన్ ఏఏవో కార్యాలయాల్లో ప్రతీ సోమవారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఎస్‌ఈ కార్యాలయంలో విద్యుత్ ప్రజావాణిని నిర్వహిస్తున్నారు. వచ్చిన ప్రతీ ఫిర్యాదును సంస్థ పోర్టల్‌లో నమోదు చేసి ఫిర్యాదు సంఖ్యను ఇస్తారు. దీంతో వినియోగదారుడికి ఫిర్యాదు ఇచ్చిన రశీదుతో పాటు అధికారులకు సమస్య పరిష్కరించాల్సిన బాధ్యత పెరిగింది.

పొలం బాటకు మంచి స్పందన

కర్నాటి వరుణ్‌రెడ్డి, సీఎండీ ఎన్‌పీడీసీఎల్

విద్యుత్ అధికారుల పొలం బాట కార్యక్రమానికి రైతుల నుంచి అపూర్వమైన స్పందన లభిస్తోంది. ఈ కార్యక్రమంలో భాగంగా అధికారులు వంగిపోయిన విద్యుత్ స్తంభాలను సరి చేస్తున్నారు. దెబ్బతిన్న స్తంభాల స్థానంలో కొత్తవి అమర్చుతున్నారు. మిడిల్ పోల్స్‌ను సైతం సరి చేస్తున్నారు. ప్రమాదాలు జరగకుండా ఉండేదుకు డీటీఆర్‌ల ప్లింత్ ఎత్తును పెంచుతున్నారు. కిందకు వేలాడుతున్న కరెంట్ లైన్లను గట్టిగా బిగిస్తున్నారు. విద్యుత్ ప్రమాదాలు జరగకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కలిగిస్తున్నారు. మోటార్లు సమర్థవంతంగా పని చేసేందుకు కెపాసిటర్లను వినియోగించాల్సిన అవసరాన్ని రైతులకు వివరిస్తున్నారు. విద్యుత్ అధికారులు పొలంబాట కార్యక్రమంలో భాగంగా ఏ రోజు ఏ గ్రామానికి వెళ్లేది రైతులకు ముందే సమాచారం ఇస్తున్నారు.

వరంగల్‌కు వెల్‌నెస్ సెంటర్

- మంజూరు చేసిన కేంద్ర ప్రభుత్వం
- కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు ప్రయోజనం
- ఫలించిన వరంగల్ ఎంపీ కావ్య కృషి

వరంగల్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు, రిటైర్డ్ ఉద్యోగులకు కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వశాఖ గుడ్‌న్యూస్ చెప్పింది. దేశవ్యాప్తంగా 22 వెల్‌నెస్ సెంటర్లను ప్రకటించగా, తెలంగాణ నుంచి వరంగల్‌ను ఎంపిక చేసింది. ఎంపీ డాక్టర్ కడియం కావ్య ప్రత్యేక చొరవతో వరంగల్‌లో వెల్‌నెస్ సెంటర్ ఏర్పాటుకు మార్గం సుగమమైంది.

కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల ఆరోగ్య పరీక్షల కోసం హైదరాబాద్, ఏపీలోని కొండపల్లిలో ఉన్న వెల్‌నెస్ సెంటర్‌లకు వెళ్లే వారు. అక్కడ వైద్య పరీక్షల అనంతరం చికిత్స చేయటమా లేక ఇతర ఆస్పత్రికి రెఫర్ చేయటమో జరిగేది. అయితే ఇది కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షర్లకు తీవ్ర అసౌకర్యంగా ఉండటంతో రెండు దశాబ్దాలుగా వరంగల్‌లోనే వెల్‌నెస్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ వస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇటీవల ఢిల్లీలో వరంగల్ ఎంపీ కడియం కావ్యను కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు కలవటంతో వారి సమస్యను పరిష్కారానికి ఎంపీ చొరవ చూపారు. కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ అధికారులతో ఎంపీ కడియం కావ్య చర్చింటంతో పాటు వరంగల్‌కు ఎందుకు వెల్‌నెస్ సెంటర్‌ను మంజూరు చేయాలో వివరించారు. అలాగే ఈ విషయమై ఎంపీ కావ్య పార్లమెంటులో సైతం గళమెత్తారు. వెల్‌నెస్ సెంటర్ కోసం ఎంపీ ఒత్తిడితో కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా ప్రకటించిన 22 వెల్‌నెస్ సెంటర్లలో వరంగల్‌కు కూడా చోటు దక్కిందనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. త్వరలోనే కొత్తగా భవనం నిర్మించి వైద్య సిబ్బందితో పాటు వైద్య పరీక్షలకు కావాల్సిన వైద్య పరికరాలను ఏర్పాటు చేయటం.. లేదంటే కేఎంసీ ఆస్పత్రిలో అదనంగా వెల్‌నెస్ సెంటర్‌ను ప్రత్యేకంగా ఏర్పాటు చేసే అవకాశం ఉందని సమాచారం. వరంగల్‌లో వెల్‌నెస్ సెంటర్ ఏర్పాటుతో పాటు ఉమ్మడి వరంగల్ జిల్లాతో పాటు ఖమ్మం, కరీంనగర్, నల్గొండ, ఆదిలాబాద్ జిల్లాలోని సుమారు 54 పట్టణాల్లో పనిచేస్తున్న కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు, రిటైర్డు ఉద్యోగులకు, వారి కుటుంబసభ్యులకు ప్రయోజనం చేకూరనుంది.


ఎంపీ డాక్టర్ కావ్యను సన్మానిస్తున్న పెన్షనర్లు

ఎంపీ కావ్యకు పెన్షనర్ల సన్మానం

వరంగల్‌కు కేంద్ర ప్రభుత్వం వెల్‌నెస్ సెంటర్‌ను మంజూరు చేయటంపై కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, సీజీహెచ్‌ఎస్ పెన్షనర్ అసోసియేషన్ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆదివారం హనుమకొండలోని ఎంపీ డాక్టర్ కడియం కావ్య స్వగృహంలో ఆమెను శాలువాతో సన్మానించారు. రెండు దశాబ్దాల డిమాండ్‌ను నెరవేరేందుకు కృషి చేసినందుకు అభినందించారు. కేంద్ర ప్రభుత్వం ఉద్యోగుల ఆరోగ్య సేవల విస్తరణకు వెల్‌నెస్ సెంటర్ ఎంతగానో ఉపయోగపడుతుందని ఈ సందర్భంగా ఎంపీ కావ్య పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పెన్షనర్ అసోసియేషన్ నాయకులు చాడ జైహిందిరెడ్డి, సదానందం, సారయ్య, లింగారెడ్డి, వెంకటస్వామి, సాంబశివుడు, అంజనేయులు, ప్రభాకర్, మహేందర్ పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే నరేందర్‌పై కేసు

మట్టెవాడ, ఆగస్టు 11: వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో పసిపాపను కుక్కలు పీక్కుతిన్న ఘటనపై నిరసన వ్యక్తం చేసిన మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్, పలువురు బీఆర్ఎస్ నాయకులపై మట్టెవాడ పోలీసులు శనివారం రాత్రి కేసు నమోదు చేశారు. పోలీసులకు ముందస్తు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా ఎంజీఎం ఆస్పత్రి ఆవరణలో ధర్నా నిర్వహించడంతో మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్‌తో పాటు కార్పొరేటర్లు కుమారస్వామి, మరుపల్ల రవి, బీఆర్ఎస్ నాయకులు కొంగరం రాజేందర్, ఎలకంటి సతీష్, మధు, దాచేపల్లి సీతారాం, బజ్జూరి వాసు, తోట స్రవంతిలపై మట్టెవాడ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ మాట్లాడుతూ అక్రమ కేసులకు భయపడేది లేదన్నారు. ప్రజల సమస్యలపై నిరసన కార్యక్రమాలు, ధర్నాలు బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తామన్నారు.

పేకాట శిబిరంపై దాడి

వరంగల్ క్రైం, ఆగస్టు 11: వరంగల్ మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్ పరిధిలో పేకాట శిబిరంపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడిచేసి రూ.10వేల నగదు స్వాధీనం చేసుకుని 8మందిపై కేసు నమోదు చేశారు. ఆదివారం వరంగల్ ప్రాంతంలో మేకల రమేశ్ అనే వ్యక్తి నివాసంలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్స్ సీఐ రాజు ఆధ్వర్యంలో దాడులు చేశారు. పట్టుకున్న 8మందిని విచారణ నిమిత్తం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు.

పద్మావతి ఎక్స్‌ప్రెస్‌కు తప్పిన ప్రమాదం

- తెగిపడిన హైటెన్షన్ విద్యుత్ వైర్
- నిలిచిన రైలు, ఇబ్బందులు పడ్డ ప్రయాణికులు
- వంగాలపల్లి రైల్వేగేటు వద్ద ఘటన


వంగాలపల్లి రైల్వేగేటు వద్ద నిలిచిన పద్మావతి ఎక్స్‌ప్రెస్

చిలుపూర్, ఆగస్టు 11: జనగామ జిల్లాలో పద్మావతి ఎక్స్‌ప్రెస్ రైలుకు పెను ప్రమాదం తప్పింది. హైటెన్షన్ విద్యుత్ వైరు తెగి కిందపడడంతో రైలు ఆగిపోయింది. దీంతో ఏం జరిగిందో తెలియక ప్రయాణికులు ఆందోళన చెందారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సికింద్రాబాద్ నుంచి తిరుపతికి వెళ్తున్న పద్మావతి ఎక్స్‌ప్రెస్ రైలు జనగామ జిల్లా వంగాలపల్లి రైల్వేగేటు సమీపంలోకి రాగానే పైనున్న హైటెన్షన్ విద్యుత్ వైర్ తెగిపోయింది. దీంతో ఒక్కఉదుటున రైలు ఆగిపోయింది. ఈఘటనలో ఎవరికీ ఏమీ కాకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. సమాచారమందుకున్న రైల్వే ఉన్నతాధికారులు ఘటనా స్థలానికి చేరుకుని విద్యుత్ వైర్లకు మరమ్మతులు చేసి కాజీపేట వైపు పంపించారు. ఈ సందర్భంగా సుమారు 40నిముషాల పాటు ఐనవోలు, ధర్మాపురం, వంగాలపల్లి, నష్కల్, వంగాలపల్లి తదితర గ్రామాలకు వెళ్ళాల్సిన ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పలురైళ్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

జర్నలిజానికి ఆచార్య చేసిన సేవలు అమూల్యం

- సీనియర్ సంపాదకుడు రాంచంద్రమూర్తి
- ఆనందాశ్రయ వృద్ధాశ్రమంలో స్మారక వైద్యశాల ప్రారంభం

హనుమకొండ, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): విలువలతో కూడిన నిఖార్సయిన జర్నలిజం కోసం తన యావజీవితాన్ని ధారపోసిన ఎంఎస్ ఆచార్య ఈ తరం ప్రాతికేయులకు స్ఫూర్తిప్రధాత అని సీనియర్ సంపాదకుడు రామచంద్రమూర్తి అన్నారు. ఆదివారం గీసుకొండ మండలంలోని గొర్రెకుంటలో గల ఆనందాశ్రయ వృద్ధాశ్రమంలో ఎంఎస్ ఆచార్య-రంగనాయకమ్మ స్మారకార్థం ఆయన కుమారుడు ప్రముఖ జర్నలిస్టు, కేంద్ర సమాచార మాజీ కమిషనర్ మాడభూషి శ్రీధరాచార్య, వేదకల్యాణి ఏర్పాటు చేసిన వైద్యశాలను ఆయన ప్రారంభించారు. రామచంద్రమూర్తి తొలుత ఎంఎస్ ఆచార్య, రంగనాయకమ్మ చిత్రపటాలకు పూలమాలవేసి నివాళులర్పించారు.

ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తన కలం ద్వారా ఆచార్య సమాజంలోని రుగ్మతలను ప్రక్షాళనం చేశారని, నాటి ఎన్నో సామాజిక ఉద్యమాలకు జనధర్మ, వరంగల్‌వాణి పత్రికల ద్వారా వెన్నుదన్నుగా నిలిచారన్నారు. సీనియర్ జర్నలిస్టు, వార్త సంపాదకుడు దామెర్ల సాయిబాబ జర్నలిజం రంగంలో ఎంఎస్ ఆచార్య చేసిన కృషిని కొనియాడారు. కేంద్ర సమాచార మాజీ కమిషనర్ శ్రీధరాచార్యులు మాట్లాడుతూ.. తన తండ్రి ఆయశయాలకు అనుగుణంగా, ఆయన చూపిన బాటలో నడుస్తున్నానని అన్నారు. ఇందులో భాగంగా ఆనందాశ్రయ వృద్ధాశ్రమంలో వృద్ధులకు వైద్య సేవలు అందించేందుకు ఈ క్లినిక్‌ను ఏర్పాటు చేసినట్టు చెప్పారు. శ్రీధరాచార్య ఆయన సతీమణి వేదకళ్యాణి రూ.15 లక్షల వ్యయంతో ఆశ్రమం ఆవరణలో నిర్మించిన రెండు గదుల్లో ఈ క్లినిక్‌ను ఏర్పాటు చేశారు. ఆశ్రమంలోని వృద్ధులకు ప్రతీరోజు వైద్య సేవ లు ఈ క్లినిక్ ద్వారా అందు తాయి. క్లినిక్‌లో కావలసిన అన్ని ఏర్పాట్లను ఇందులో చేశారు.

ఈ కార్యక్రమానికి సీనియర్ జర్నలిస్టు దాసరి క్రిష్ణారెడ్డి, డాక్టర్ కోదండరామా రావు, ఆయన సతీమణి డాక్టర్ అంజనీదేవి, రిటైర్డ్ లెక్చరర్ రమణ, విమల తదిత రులు పాల్గొన్నారు. క్లినిక్‌ను ఏర్పాటు చేసినందుకు ఆనందాశ్రయ వృద్ధాశ్రమ నిర్వాహకులు ధన్యవాదాలు తెలిపారు.



వృద్ధాశ్రమంలోని ఎంఎస్ ఆచార్య స్మారక వైద్యశాల

ఒక్క రైలు కోసమేనా?

- నిరుపయోగంగా కాజీపేట టౌన్ రైల్వే స్టేషన్
- ఇబ్బంది పడుతున్న ప్రయాణికులు
- హాల్టింగ్‌లకు నోచుకోని పలు రైళ్లు
- జంక్షన్ నుంచి ఒక్కటిగా రద్దవుతున్న రైళ్లు
- పట్టించుకోని రైల్వే ఉన్నతాధికారులు

కాజీపేట, ఆగస్టు 11: రూ.కోట్లు వెచ్చించి నిర్మించిన కాజీపేట టౌన్‌స్టేషన్‌ది విచిత్రమైన పరిస్థితి. ఇక్కడ కేవలం (17033/34) భద్రాచలం నుంచి బల్లార్షా వెళ్లే సింగరేణి ఒక్క రైలుకు మాత్రమే హాల్టింగ్ సౌకర్యం ఉంది. చెన్నై నుంచి న్యూఢిల్లీ అప్‌అండ్ డౌన్ నడిచే ప్రతీ సూపర్‌ఫాస్ట్ రైళ్లు కాజీపేట టౌన్ స్టేషన్ మీదుగానే వెళుతుంటాయి. ప్రతీరోజు సుమారు 50 వరకు సూపర్‌ఫాస్ట్ రైళ్లు టౌన్‌స్టేషన్ మీదుగా వెళుతున్నా.. ఇక్కడ ఒక్క రైలుకు హాల్టింగ్ లేదు. కాజీపేట పరిసర ప్రాంతాలవాసులు రైలెక్కాలంటే వరంగల్ రైల్వే స్టేషన్‌కు వెళ్లాల్సి వస్తోంది. సికింద్రాబాద్‌లో హాల్టింగ్ వున్న ప్రతీ రైలుకు హైదరాబాద్ రైల్వే స్టేషన్‌లో హాల్టింగ్ ఇస్తుండగా, వరంగల్‌లో హాల్టింగ్ వున్న ప్రతీ రైలుకు కాజీపేట టౌన్‌స్టేషన్‌లో హాల్టింగ్ ఎందుకు ఇవ్వరని ప్రయాణికులు ప్రశ్నిస్తున్నారు. పైగా న్యూఢిల్లీ నుంచే వచ్చే ప్రతీ రైలును నాగపూర్‌లో వాటర్, క్లీనింగ్ చేస్తుంటారు. నాగపూర్ తర్వాత మళ్లీ విజయవాడలోనే ఈ సౌకర్యం ఇవ్వడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాజీపేట టౌన్‌స్టేషన్ పక్కనే వడ్డెపల్లి చెరువు వుంది. ఇక్కడ హాల్టింగ్ ఇవ్వడం వల్ల వాటర్, క్లీనింగ్‌తోపాటు ప్రయాణికులకు మంచి సౌకర్యం వుంటుంది. అలాగే ఈ రైళ్లను నడిపే లోకో పైలెట్‌లు కాజీపేటలో ఉంటుండగా, ఇక్కడరైళ్లకు హాల్టింగ్ లేకపోవడంతో లోకో పైలెట్‌లను కాజీపేట నుంచి ప్రత్యేక వాహనాల ద్వారా వరంగల్‌కు తీసుకెళుతున్నారు. దీనికి లోకోపైలెట్‌లకు అదనంగా డబ్బులు చెల్లించాల్సి వస్తోంది. కాజీపేట టౌన్‌స్టేషన్‌లో హాల్టింగ్ సౌకర్యం కల్పిస్తే రైల్వేకు లాభంతోపాటు ప్రయాణికులకు మంచి సౌకర్యం వుంటుందనేది పలువురి వాదన.

ఒక్కొక్కటిగా రద్దవుతున్నరైళ్లు

కాజీపేట జంక్షన్ మీదుగా పలురైళ్లు నడిపే అవకాశం ఉన్నా అధికారులు ఆసక్తి చూపడంలేదు. ముంబై, తిరుపతి, నాగపూర్, బెంగళూర్, ఢిల్లీ, వెళ్లే రైళ్లు కిక్కిరిసిపోతుంటాయి. కాజీపేట నుంచి నడపడానికి అన్ని సౌకర్యాలున్నా నడపడం లేదని విమర్శలు తలెత్తుతున్నాయి. పైగా ఇక్కడి నుంచి నడిచే రైళ్లను ఒక్కొక్కటిగా రద్దు చేస్తున్నారు. కాజీపేట నుంచి నాగపూర్ వెళ్లు నాగపూర్ ప్యాసింజర్, కాజీపేట-మణుగూరు ప్యాసింజర్, కాజీపేట-తడోబా ఎక్స్‌ప్రెస్, కాజీపేట-సికింద్రాబాద్ పుష్‌పుల్ రైళ్లను రద్దు చేశారు. అధికారులకు అవగాహన లేకపోవడమా..; అలసత్వమా..? అనే అర్థం కావడం లేదు. ఇప్పటికైనా కాజీపేట మీదుగా పలు రైళ్లను నడపడమే కాకుండా టౌన్‌స్టేషన్‌లో పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్టింగ్ సౌకర్యం కల్పించి, కాజీపేటకు ప్రాధాన్యతను పెంచాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.



కాజీపేట టౌన్ స్టేషన్


కాజీపేటలో రైల్వే స్టేషన్

జంక్షన్‌పై చిన్నచూపు

ఉత్తర - దక్షిణ రైల్వే మార్గాలను కలిపే కాజీపేట రైల్వే జంక్షన్‌కు గేట్ వే ఆఫ్ ఇండియాగా పేరుంది. దక్షిణ మధ్య రైల్వేలోనే రైల్వేకు అత్యధిక ఆదాయాన్ని సమకూర్చే కాజీపేట రైల్వే జంక్షన్‌ను అధికారులు నిర్వీర్యం చేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. ఇక్కడ రెండు రైల్వేస్టేషన్‌లు ఉన్నప్పటికీ రైళ్ల కోసం ప్రయాణికులకు తిప్పలు తప్పడం లేదు. ఇక్కడ్నుంచి వెళ్లే కొన్ని రైళ్లకు హాల్టింగ్ సౌకర్యం కల్పించకుండా, కొత్త రైళ్లను నడపకుండా ఒక రకంగా కాజీపేటకు ఉన్న ప్రాధాన్యతను తగ్గిస్తున్నారనే ప్రచారం ఉంది.




ఆంధ్రజ్యోతి WARANGAL CITY 6
వరంగల్ సిటీ
• వరంగల్ • ఖిలావరంగల్
సోమవారం 12 ఆగస్టు 2024

జర్నలిస్ట్ యోగి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి

గిర్మాజిపేట, ఆగస్టు11: వృత్తి విలువలతో పనిచేస్తూ ఆర్థిక ఇబ్బందులు తాళలేక కూతురుతో సహా ఆత్మహత్య చేసుకున్న జర్నలిస్ట్ యోగి రెడ్డి కుటుంబాన్ని ఆదుకోవాలని అఖిల భారత ప్రజాతంత్ర విద్యార్థి సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడ్డం నాగార్జున ఆదివారం విడుదల చేసిన పత్రికా ప్రకటనలో రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. జర్నలిస్ట్‌గా సమాజానికి మేలుచేయాలనే తపనతో పనిచేస్తున్న యోగి ఆర్థిక ఇబ్బందులు తాళలేక కూతురితో ఆత్మహత్య చేసుకోవడం చాలా బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జర్నలిస్టులకు తగిన భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. భర్తను, కూతురును కోల్పోయిన యోగి భార్యకు ప్రభుత్వ ఉద్యోగంతో పాటుగా రూ.50 లక్ల ఎక్స్‌గ్రేషియా చెల్లించి జర్నలిస్టుల్లో మనోధైర్యం నింపాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

దత్తాత్రేయ స్వామికి వైభవంగా తైలాభిషేకం



రుద్రాంశ అలంకరణలో దత్తాత్రేయుడు

వరంగల్ కల్చరల్, ఆగస్టు 11: నగరంలోని శ్రీగణపతి సచ్చిదానంద వరద దత్తక్షేత్రంలో శ్రావణ మాసం పురస్కరించుకొని ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. దాదాపు వెయ్యి మంది భక్తులు హాజరయ్యారు. దత్తాత్రేయ స్వామికి తైలం, క్షీరం, సుగంధ ద్రవ్యాలతో ఆలయ అర్చకులు రాపాక గోపీకృష్ణశర్మ నిర్వహించి హారతి నిర్వహిచారు. అనంతరం భక్తులందరికి తీర్థ ప్రసాద వితరణ, అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమం ఎగ్జిక్యూటీవ్ ట్రస్టీ మెంబర్ వైవీ వామన్‌రావు, ట్రస్టు సభ్యులు కృష్ణ ప్రసాద్, డాక్టర్ కంటెం లక్ష్మీనారాయణ, ఏకాంబరం, వడిచర్ల శ్రీనివాస్, మాతృమండలి సభ్యులు , భక్తులు తదితరులు పాల్గొన్నారు.

పోచమ్మ తల్లి బోనాలు



డప్పుచప్పుళ్లతో బోనాలను అమ్మవారికి సమర్పించడానికి వెళ్తున్న మహిళలు

వరంగల్ సిటీ, ఆగస్టు 11: రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఆదేశాల మేరకు పోచమ్మ దేవాలయాల కుమ్మరి పూజారులతో కాశిబుగ్గలో శ్రీపోచమ్మ దేవాలయానికి శ్రావణమాసం మొట్టమొదటి బోనాలను వారి ఇంటి నుంచి అమ్మవారికి సమర్పించారు. ఆదివారం కాశిబుగ్గలోని కుమ్మరి పూజారుల ఆధ్వర్యంలో డప్పుచప్పుళ్లతో ఇంటి ఆడపడులందరు సామూహి కంగా బోనాలను పోచమ్మ దేవాలయంలో ఊరేగింపుగా వెళ్లి సమర్పించారు. ఈ సందర్భంగా శ్రావణమాసం మొత్తం అమ్మవారికి బోనాలు నిర్వహి ంచనున్న నేపథ్యంలో ఆలయాల వద్ద చలువ పందిళ్లు, విద్యుత్ దీపాలంకరణ, నీటి వసతి, క్యూ లైన్లు ఏర్పాటు చేసినట్లు ఈవో జి. శేషగిరి తెలిపారు. కార్యక్రమంలో ఓరుగంటి రాజేందర్, కందికొండ కుమారస్వామి, ముప్పా రపు ఉపేందర్, అర్జున్, చింత కృష్ణ, కె. రవీందర్, సమ్మక్క, నీలం అరుణ, పల్లకొండ రాజమణి తదితరులు పాల్గొన్నారు.

గాంధీజీ విగ్రహం వద్ద నివాళులు



గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

ఖిలావరంగల్, ఆగస్టు 11:స్వాతంత్ర్యసమరయోధుడు మహాత్మా గాంధీ విగ్రహం చుట్టూ బీజేపీ నాయకులు ఆదివారం శుభ్రం చేశారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంటా రవికుమార్ ఆదేశాల మేరకు 35వడివిజన్ బీజేపీ అధ్యక్షుడు వైట్ల గణేష్ ఆధ్వర్యంలో హర్‌ఘర్ తిరంగా అభినయ్ కార్యక్రమంలో భాగంగా నగరంలోని 35వడివిజన్‌లో గల మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గణేష్ మాట్లాడుతూ దేశం కోసం నిస్వార్థంగా తమ జీవితాలను త్యాగం చేసిన గొప్పనాయకులను మనం స్మరించుకోవాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు ఇనుముల అజయ్, ఎం.రాంమూర్తి, డివిజన్ ఉపాధ్యక్షుడు పిట్టల వెంకన్న, బూత్ అధ్యక్షులు చంద రాజు, చింతం రోహిత్, చర్ల నవీన్, యువ మోర్చా అధ్యక్షుడు సూరజ్, తదితరులు పాల్గొన్నారు.

చైన్‌స్నాచింగ్‌లతో బెంబేలు



అభద్రతాభావంలో మహిళలు..
అప్రమత్తతే ఆయుధమంటున్న పోలీసులు
నగరంలో పూర్తి స్థాయిలో పనిచేయని నిఘా నేత్రాలు..

మట్టెవాడ, ఆగస్టు 11: నగరంలో నలు వైపులా నిఘా నేత్రాలు.. 24 గంటలు గస్తీ వాహనాలు.. డయల్ 100కు ఫోన్ చేస్తే 4, 5 నిమిషాల్లో సంఘటలన స్థలానికి చేరగల పోలీసులు.. ఇంత పకడ్బందీగా పోలీస్ నిఘా వ్యవస్థ ఉన్నప్పటికీ చైన్ స్నాచర్లు నగరంలో పంజా విసురుతున్నారు. పది రోజుల వ్యవధిలో వరుసగా మూడు వరుస స్నాచింగ్‌లు ఒంటరిగా ఉన్న మహిళలే టార్గెట్‌గా జరిగాయి. వరుస స్నాచింగ్‌లు జరగడంతో మహిళలు అభద్రతా భావానికి గురవుతున్నారు. వరంగల్ కమిషనరేట్ పరిధిలో గత మూడేళ్ల నుంచి 49 చైన్ స్నాచింగ్‌లు జరిగినట్లు పోలీసుల రికార్డులు తెలుపుతున్నాయి. ఇందులో 39 చైన్ స్నాచింగ్ కేసులను పోలీసులు చేదించారు. పోలీసులకు చైన్ స్నాచింగ్‌లు చేధించడంలో సీసీ పుటేజీలు కీలకంగా మారుతున్నాయి. దానితో పాటు ద్విచక్ర వావానాలకు సంబంధించిన నెంబర్ ప్లేట్లు కీలకంగా మారాయి. వరుస చైన్ స్నాచింగ్‌లతో స్నాచర్లు పక్కా వ్యూహంతో మహిళలను టార్గెట్ చేస్తూ మెడలోంచి ఆభరణాలను లాక్కెళుతుండడం గమనార్హం.

అప్రమత్తతోనే అరికట్టవచ్చు..



మహిళలు బంగారు అభరణలు ధరించినప్పుడు అప్రమత్తంగా ఉండాలి. విధుల్లో, కాలనీల్లో ప్రధాన రహదారుల్లో తప్పనిసరిగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలి.ద్విచక్ర వాహనాలపై అనుమానితులు ఎవరైనా కనిపిస్తే వెంటనే డయల్ 100కు ఫోన్ చేయాలి. నేరాల అదుపులో ప్రజల సహకారం అవసరం. విద్యా సంస్థలు, షాపింగ్ మాల్స్, అపార్ట్‌మెంట్‌లు, ఆస్పత్రుల్లో ప్రజాభద్రత చట్టం ప్రకారం విధిగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలి.
- నందిరాం నాయక్, ఏసీపీ, వరంగల్

వరుస చోరీలు ఇవే..

పది రోజుల క్రితం ఇద్దరూ చైన్ స్నాచర్లు వరంగల్ కొత్తవాడ ప్రాంతంలో మహిళ మెడలోంచి బంగారు గొలుసును లాక్కెళ్లారు. అదే ఇవిధంగా వరంగల్ చౌరాస్తాలో ఓ దుకాణంలో ఒంటరిగా ఉన్న మహిళ మెడలోంచి స్నాచర్ బంగారు గోలుసును దోచుకెళ్ళారు. రెండు రోజుల క్రితం హనుమకొండలోని శ్రీనగర్ కాలనీ ప్రాంతంలో ఒంటిరిగా వెళ్తున్న మహిళ మెడలోంచి ఇద్దరూ దుండగులు ద్విచక్ర వాహనంపై వచ్చి చైన్ లాక్కెళ్ళారు. స్నాచర్లు పక్కా ప్రణాళికతో స్నాచింగ్‌లకు పాల్పడుతున్నట్లు పోలీసులు భావిస్తున్నారు. ఉదయం రాత్రి సంబంధం లేకుండా స్నాచర్లు రెక్కీ నిర్వహించి స్నాచింగ్‌లకు పాల్పడుతున్నట్లు పోలీసుల విచారణలో వెల్లడవుతోంది. స్నాచర్లను అరికట్టేందుకు కాలనీల్లో, ప్రధాన వీధుల్లో ప్రధాన రోడ్డు మార్గంలో జన సంచారం ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో సీసీ కెమెరాలను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని పోలీసులు అంటున్నారు.

పోలీసుల సూచనలు ఇలా..

- మహిళలు బయటకు వెళ్లే సమయంలో బంగారు ఆభరణాలు ధరిస్తే అప్రమత్తంగా ఉండాలి.
- ఆభరణాలు కన్పించకుండా చీర కొంగు, బట్టలు కట్టుకోవాలి
- నడిచి వెళ్లేటప్పుడు ముందు పక్క నుంచి ఒకటికి రెండు సార్లు ద్విచ క్రవాహనంపై, నడుచుకుంటూ గుర్తు తెలియని వ్యక్తులు తిరుగుతుంటే వెంటనే అప్రమత్తమవ్వాలి.
- ముఖం కనిపించకుండా ముసుగు వేసుకుని, నంబర్ ప్లేట్ లేకుండా వాహనంపై తిరుగుతున్న వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలి.
- దగ్గరికి వచ్చి అనవసరంగా మాటలు కలిపే వారిని గుర్తించి వెంటనే అప్రమత్తమవ్వాలి.
- ఫోన్లలో మాట్లాడుకుంటూ విధుల్లో నడకుండా జాగ్రత్త పడాలి.
- ఉదయం, సాయంత్రం వేళల్లో వాకింగ్ కు వెళ్లే వారు బంగారు ఆభరణాలు ధరించవద్దు .
- రాత్రి సమయంలో మహిళలు ఒంటరిగా బయటకు వెళ్లొద్దు.
- సంఘటన జరిగితే వాస్తవ వివరాలను వెల్లడించాలి .
- ప్రతీ కాలనీ ప్రధాన రహదారుల్లో సీసీకెమెరాలు ఏర్పాటు చేయాలి.

ఆరు గ్యారెంటీల అమలులో ప్రభుత్వం విఫలం

• ప్రజాసమస్యలపై పాలకులు దృష్టి పెట్టాలి
• కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు



గార్లలో పర్యటిస్తున్న కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

గార్ల, ఆగస్టు 11 : తెలంగాణలో ఆరు గ్యారంటీల అమలులో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం విఫలమైందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఆరోపించారు. మహబూబాబాద్ జిల్లా గార్ల మండలంలోని గార్ల పాకాల ఏటి వద్ద వంతెన నిర్మించే ప్రాంతాన్ని ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాలకులు ప్రజాసమస్యల పరిష్కారం కోసం దృష్టి పెట్టాలన్నారు. సమస్యల ఎజెండానే సీపీఐ సమరశీల పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు. బయ్యారంలో ఉక్కు పరిశ్రమ, గార్ల మండలంలో రాంపురం వద్ద పాకాల ఏటి వంతెన ఏర్పాటు కోసం అసెంబ్లీలో సీపీఐ తన వాణిని వినిపిస్తుందన్నారు. గత పాలకులు రాంపురం ఏటి వద్ద వంతెనను నిర్మిస్తామని మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు రూ.15 కోట్ల నిధులు మంజూరు చేశారని, ఎన్నికల సమయంలో శిలాఫలకం వేసి చేతులు దులుపుకున్నారని మండిపడ్డారు. ప్రజలు నమ్మకంతో కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టారని, దీన్ని వమ్ము చేయకుండా ఇచ్చిన హామీలను అమలు చేసే విధంగా పాలన కొనసాగాలన్నారు.

కాంగ్రెస్ నాయకులు తమ సొంత ఎజెండాతో అధికారులను వేదిస్తూ, సమస్యలను పరిష్కరించకుండా కాలయాపన చేయడం విడ్డూరంగా ఉందన్నారు. గతంలో మాజీ ఎమ్మెల్యే చేసిన విధంగానే ప్రస్తుత శాసనసభ్యుడి వ్యవహారవైలి ఉందన్నారు. ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య పాకాల ఏటి వద్ద వంతెన నిర్మాణం, బయ్యారంలో ఉక్కుపరిశ్రమ ఏర్పాటుకు రాష్ట్రప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చి, నిధులు తీసుకువచ్చి పనులు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి విజయసారథి, మహబూబాబాద్ మునిసిపల్ ఫ్లోర్ లీడర్ అజయ్‌సారథి, కట్టెబోయిన శ్రీనివాస్, జంపాల వెంకన్న, రాంపురం మాజీ సర్పంచ్ గుగులోతు తారాబాయి, వెంకటేష్, రమేష్ పాల్గొన్నారు.



మొగిలయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జీవన్ తదితరులు

బత్తిని మొగిలయ్యగౌడ్ వర్ధంతి

ఖిలావరంగల్, ఆగస్టు 11: స్వాతంత్ర్యసమరయోధుడు బత్తిని మొగిలయ్య జీవితచరిత్రను పాఠ్య పుస్తకాల్లో ముద్రించాలని బార్ కౌన్సిల్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తీగల జీవన్‌గౌడ్ అన్నారు. ఖిలావరంగల్ అమరవీరుల స్థూపం వద్ద మొగిలయ్యగౌడ్ 78వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జీవన్‌గౌడ్ మాట్లాడుతూ 1946 స్వాతంత్ర్య పోరాటంలో ఆర్యసమాజ్, జాతీయ కాంగ్రెస్ పార్టీలో మొగిలయ్యగౌడ్ చురుగ్గా పనిచేశాడన్నారు. ఆరోజుల్లో ప్రతీ ఆదివారం మడికొండ, ఖిలావరంగల్‌కోటలో జాతీయజెండాలను ఎగురవేసేవారని తెలిపారు.

11-8-1946 రోజున ఖిలావరంగల్ తూర్పుకోటలో జాతీయజెండాను ఎగురవేసిన వారిపై సైనికులు వచ్చి దాడిచేసేక్రమంలో మొగిలయ్యగౌడ్ వారిపై ఎదురదాడిచేశారన్నారు. అప్పుడు సైనికులు వెనుతిరిగి మళ్లీ రెండు రోజుల తర్వాత వచ్చి మొగిలయ్యగౌడ్‌ను హత్యచేసి పారిపోయారని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ బైరబోయిన ఉమా-దామోదర్ యాదవ్, మోకుదెబ్బ రాష్ట్ర వర్కింగ్ ప్రెసి డెంట్, వరంగల్ గోపా జిల్లా కోశాధికారి అనంతుల రమేష్‌గౌడ్, మొగిలయ్యగౌడ్ ఫౌండేషన్ వరంగల్ జిల్లా గోపా సభ్యుడు మడిపెల్లి రమేష్‌గౌడ్, ఉమ్మగాని గణేష్‌గౌడ్, గోపా జిల్లా ప్రచారకార్య దర్శి పోశాల రమేష్‌గౌడ్, తీగల శ్రీధర్‌గౌడ్, సాగర్ల శ్రీనివాస్, తడక శ్రీనివాస్, పోశాల రాజేష్, సు రేష్, రవి, ఎల్లగౌడ్, తిరుమలేశ తదితరులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న నాగరాజు

కరీమాబాద్, ఆగస్టు 11: తెలంగాణ వ్యాప్తంగా గత ఆరేళ్లగా పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రియింబర్స్‌మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ తెలంగాణ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఆర్ఎల్ మూర్తి, తాళ్ల నాగరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ఉర్సు గుట్టలోని ఎస్ఎఫ్ఐ తెలంగాణ రాష్ట్ర కమిటీ సమావేశాలు ప్రారంభమయ్యాయి. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎల్ మూర్తి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి తాళ్ల నాగరాజు మాట్లాడుతూ ప్రైవేటు యాజమాన్యాలు ఫీజుల రాలేదనే పేరుతో విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదన్నారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అదే విధంగా రాష్ట్ర వ్యాప్తంగా సాంఘిక సంక్షేమ హాస్టళ్ల పరిస్థితి అధ్వాన్నంగా తయారైందని, కాస్మోటిక్ చార్జీలు పేరుకే తప్ప విద్యార్థులకు సరిపోవడం లేదని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు రజనీకాంత్, శ్రీకాంత్‌వర్మ, సంతోష్, శంకర్, రాష్ట్ర సహాయ కార్యదర్శి మమత, దాసరి ప్రశాంత్, గజ్జెల శ్రీకాంత్, గర్ల్స్ కన్వీనర్ పూజ, సోషల్‌మీడిగా కన్వీనర్ కిరణ్, రాష్ట్ర కమిటీ సభ్యులు ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మైసమ్మ తల్లి విగ్రహ యంత్ర ప్రతిష్ఠాపన



బోనాలు సమర్పించేందుకు వస్తున్న శివసత్తులు

కరీమాబాద్, ఆగస్టు 11: కరీమాబాద్ ప్రాంతంలో ఆదివారం శ్రీ మైసమ్మ తల్లి, పోతలింగన్న స్వామి సహిత శిఖర కళశ యంత్ర ప్రతిష్ఠాపన మహోత్సవ కార్యక్రమాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. శ్రీ మైసమ్మ తల్లి దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం ఉదయం 7.38 గంటలకు యంత్ర విగ్రహ స్థాపనలు, ఉదయం 10 గంటలకు పట్నం వేయుట, బలిహారం నిర్వహించారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం 4 గంటలకు అమ్మవారికి బోనాలను సమర్పించారు. ఈ కార్యక్రమాలతో కరీమాబాద్ ప్రాంతంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. పోతరాజుల విన్యాసాలతో, శివసత్తుల పూనకాలతో, డప్పు చప్పుళ్ల మోతలతో కరీమాబాద్ ప్రాంతం దద్దరిల్లిపోయింది. ఈ వేడుకల్లో కమిటీ సభ్యులు, స్థానిక ప్రజలు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

భద్రకాళి సన్నిధిలో ఐజీ దంపతుల పూజలు



భద్రకాళి ఆలయంలో పూజలు చేస్తున్న ఐజీ తరుణ్‌జోషి

వరంగల్ కల్చరల్, ఆగస్టు 11: చారిత్రక భద్రకాళి అమ్మవారికి ఐజీ తరుణ్‌జోషి ఆదివారం కుటుంబసభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న తరుణ్‌జోషి ముందుగా వల్లభ గణపతిస్వామిని దర్శించుకుని ఆ తర్వాత భద్రకాళి అమ్మవారిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు సంప్రదాయ బద్ధంగా ఆహ్వానించారు. తీర్థ ప్రసాదాలు అందజేశారు.

జైళ్ల శాఖ డీసీపీ పూజలు

చారిత్రక భద్రకాళి అమ్మవారిని జైళ్ల శాఖ డీసీపీ మురళీధర్ రావు ఆదివారం అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి చేరుకున్న డీసీపీ ముందుగా వల్లభ గణపతిని దర్శించుకొని తర్వాత అమ్మవారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. పూజల అనంతరం అర్చకులు డీసీపీని ఆశీర్వదించి అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. శ్రావణమాసం ఆదివారం కావడంతో అమ్మవారి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. ఉదయం నుంచి రాత్రి వరకు వేల సంఖ్యలో భక్త లు ఆలయానికి తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తుల కు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా ఈవో శేషు భారతి, సూపరింటెండెంట్ విజయ్‌కుమార్‌లు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

నాలాలపై అక్రమ నిర్మాణాలను కూల్చివేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న పెరుమాళ్ల లక్ష్మణ్

వరంగల్ సిటీ, ఆగస్టు 11: గ్రేటర్‌లోని నాలాలను ఆక్రమించి నిర్మించిన నిర్మాణాలను వెంటనే కూల్చివేయాలని చెరువుల పరిరక్షణ కమిటీ అధ్యక్షుడు పెరుమాళ్ల లక్ష్మణ్ డిమాండ్ చేశారు. నగరంలోని ఎల్బీనగర్‌లో లక్ష్మణ్ అధ్యక్షతన ఆదివారం చెరువుల పరిరక్షణ కమిటీ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రేటర్ కార్పొరేషన్ పరిధిలోని 66 డివిజన్లలో హనుమకొండ, వరంగల్, కాజీపేట నాలాలను ఆక్రమించి నిర్మించిన నిర్మాణాలపై చర్చించారు. నాలాలు, బఫర్‌జోన్‌లలో అక్రమ నిర్మాణాలు చేపట్టి జీ ప్లస్ 1, జీ ప్లస్ 2, జీప్లస్ 3 అంతస్తుల వరకు నిర్మించినట్లు కార్యవర్గం గుర్తించింది. అనంతరం లక్ష్మణ్ మాట్లాడుతూ.. సంవత్సరంలో కమిషనర్‌ను తొమ్మిదిసార్లు కలిసి అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదులు చేసినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు.

దేశాయిపేట చిన్నవడ్డేపల్లి చెరువు 60 ఫీట్ల నాళాపై, 34వ డివిజన్ శివనగర్ వందన స్కూల్ సమీపంలో, మట్టెవాడ కోట చెరువు సమీపంలో, రంగశాయిపేట బేస్తం చెరువు నాళాపై, ఉర్సు రంగసముద్రం చెరువు నాలాపై, కాజీపేట బందం చెరువు, హసన్‌పర్తి పెద్ద చెరువు నాలాలపై ఆక్రమ నిర్మాణాలు వెలిశాయని తెలిపారు. కమిషనర్, మునిసిపల్ అధికారులు వెంటనే నాలాలను ఆక్రమించుకుని నిర్మించిన అక్రమ నిర్మాణాలను వెంటనే కూల్చివేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పోతన వెంకటేశ్వర్లు, భాస్కుల హరినారాయణ, గణిపాక క్రాంతి కుమార్, మల్లికార్జున్, సిలువేరు నగేష్ తదితరులు పాల్గొన్నారు.

బురద చల్లేవారి మాటలు నమ్మొద్దు

• అమ్మవారి సాక్షిగా అందరికి న్యాయం చేస్తాం
• మాజీ మేయర్ గుండా ప్రకాష్‌రావు



సమావేశంలో మాట్లాడుతున్న గుండా ప్రకాష్‌రావు

వరంగల్ కల్చరల్, ఆగస్టు 11: ఆర్యవైశ్య సభ్యులు సొసైటీలో ఉన్నవారందరికీ అమ్మవారి సాక్షిగా స్థలాలను రిజి స్ట్రేషన్ చేసి ఇస్తామని, తమపై బురద చల్లేవారి మాటలు నమొద్దని పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు, మాజీ మేయర్ గుండా ప్రకాష్‌రావు అన్నారు. రామన్నపేటలోని సుశీల్ గార్డెన్‌లో ఆదివారం ఆర్యవైశ్య సొసైటీ సభ్యుల ముఖాముఖి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు 400 మందికి పైగా స్థలాలు రిజిస్ట్రేషన్ చేయించానని మిగతా వారికి కూడా వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి సాక్షి గా త్వరలోనే రిజిస్ట్రేషన్ చేయిస్తానని ఆయన తెలిపారు. సమావేశంలో పట్టణ ఆర్యవైశ్య సంఘం ప్రధాన కార్యదర్శి మాదారపు రాజేశ్వర్‌రావు, ఆర్యవైశ్య సామాజిక వర్గానికి చెందిన న్యాయవాదులు ఐతా ప్రసాద్, గుండా ముక్తేశ్వర్, అల్లాడి వీరభద్రయ్య, వంగేటి అశోక్‌కుమార్, గాదె వాసుదేవ్, వేణుగోపాల్, తదితరులు పాల్గొన్నారు.

బండి సంజయ్‌ని కలిసిన గోగికార్ అనిల్



బండి సంజయ్‌ని కలిసిన అనిల్

కరీమాబాద్, ఆగస్టు 11: కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్‌ను కరీమాబాద్ ప్రాంతానికి చెందిన బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, బీజేపీ ఓబీసీ మోర్చా కరీంనగర్ జిల్లా కో ఇన్‌చార్జి గోగికార్ అనిల్ ఆదివారం మర్యాద పూర్వకంగా కలిశారు. తనను బీజేపీ ఓబీసీ మోర్చా కరీంనగర్ జిల్లా కో-ఇంచార్జిగా ఎంపిక చేసిన సందర్భంగా ఎంపీ బండి సంజయ్‌కుమార్‌ను కరీంనగర్‌లో ఆయన కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలసినట్లు అనిల్ తెలిపారు.

పీఏసీఎస్‌లో పోలీసుల తనిఖీలు

నల్లబెల్లి, ఆగస్టు 11 : నల్లబెల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో దుగ్గొండి రూరల్ సీఐ రాజగోపాల్ ఆధ్వర్యంలో ఆదివారం తనిఖీలు చేపట్టారు. పీఏసీఎస్‌లో సభ్యత్వం ఉన్నవారు, తీసుకున్న రుణం కన్నా ఎక్కువ రుణం పొందినట్లు రికార్డుల్లో ఉందని సీఐ రాగోపాల్ విలేకరులకు తెలిపారు. సభ్యత్వం లేని రైతుల ఆధార్ కార్డు నెంబర్లతో పీఏసీఎస్‌లో సొసైటీ సిబ్బంది రుణాలను పొందినట్లు రికార్డులలో నమోదై ఉందన్నారు. సొసైటీ లెజండ్రి రికార్డు బుక్కుల్లో నమోదైన రైతుల రుణాల్లో అవకతవకలు ఉన్నాయని ఆయన తెలిపారు. సొసైటీలో రూ.లక్ష, రూ.లక్షకు పైగా రుణాలు పొందినట్లు ఉన్న మండలంలోని రైతుల వద్దకు నేరుగా వెళ్లి కలుస్తామన్నారు. వారి నుంచి సేకరించిన సమాచారంతో తదుపరి చర్యలు చేపడతామని తెలిపారు.



ఆంధ్రజ్యోతి WARANGAL RURAL సోమవారం 12 ఆగస్టు 2024

వరంగల్ రూరల్

• నర్సంపేట • దుగ్గొండి • చెన్నారావుపేట • ఖానాపురం • నల్లబెల్లి • నెక్కొండ • పర్వతగిరి • వర్ధన్నపేట • రాయపర్తి • సంగెం • గీసుగొండ

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

గీసుగొండ, ఆగస్టు 11 : గీసుగొండ జెడ్పీ పాఠశాలలో 1990-91 బ్యాచ్ టెన్త్ చదివిన విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించారు. 33 ఏళ్ల తరువాత కలుసుకున్న వారు ఒకరినొకరి యోగక్షేమాలను అడిగి తెలుసుకొని పాఠశాలలో చదువుకున్న రోజుల తీపి జ్ఞాపకాలను నెమరువేసుకుని ఆనంద డోలికల్లో మునిగిపోయారు. ఆనాటి ఉపాధ్యాయులను ఆహ్వానించి ఆత్మీయంగా సన్మానించారు. పూర్వ విద్యార్థి అయిన ప్రొఫెసర్ రాధాకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో నాటి ఉపాధ్యాయులు రిటైర్డ్ డిప్యూటీ డీఈవో వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు సయ్యద్అలీ అక్బర్, కె. రమణాచారి, మోహన్‌రెడ్డి, దేవేంద్రాచారి, నరసింహస్వామి, బ్రహ్మయ్య, టి.వెంకటేశ్వర్లు, పూర్వవిద్యార్థులు పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరాన్ని వినియోగించుకోవాలి



కంటి శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నాగరాజు

వర్ధన్నపేట, ఆగస్టు 11 : కంటి చూపు సమస్య పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాన్ని ప్రజలు వినియోగించుకోవాలని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు అన్నారు. నాట్య జ్యోతి కూచిపూడి అకాడమీ నిర్వాహకురాలు నాగజ్యోతి తన తండ్రి కోరిక నెరవేర్చడానికి కంటిచూపుతో ఎవరు బాధపడొద్దనే ఉద్దేశ్యంతో స్థానిక నూతన మునిసిపాలిటీ భవన సముదాయంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య కంటి శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. నాగ జ్యోతి మాట్లాడుతూ అమెరికాలోని అట్లాంటా ప్రాంతంలో స్థిరపడి నాట్యజ్యోతి కూచిపూడి అకాడమీని స్థాపించానన్నా రు. గతంలో తన తండ్రి ఎల్ఎస్.రాజు వరంగల్ ఎమ్మెల్సీగా పనిచేశారని చెప్పారు. ఆయన జ్ఞాపకార్థం కంటి సమస్యలతో బాధపడు తున్న వారికి అధునాతన సాంకే తిక పరికరాలతో చికిత్స చేయించేందు కోసం శంకర్ నేత్రాలయ చెన్నై వారి సహకారంతో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎన్ఐటీ వరంగల్ రిటైర్డ్ ప్రొఫెసర్ పాండురంగారావు తదితరులు పాల్గొన్నారు.

• మునిసిపల్ కార్మికురాలికి ఎమ్మెల్యే పరామర్శ

వర్ధన్నపేట మునిసిపల్ కార్యాలయంలో ఔట్ సోర్సింగ్ పద్ధతిలో విధులు నిర్వహిస్తున్న మునిసిపల్ కార్మికురాలు నందిపాక ప్రేమలీల ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై గాయాలయ్యాయి. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ప్రేమలీలను వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్. నాగరాజు పరామర్శించి అన్ని విధాలుగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. ఆయన వెంట మునిసిపల్ చైర్ పర్సన్ అంగోత్ అరుణ, మున్సిపల్ కమిషనర్ ఇ.జోనా, కాంగ్రెస్ శ్రేణులు తదితరులు ఉన్నారు.

రైతు సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తా

వ్యవసాయ మార్కెట్ అభివృద్ధికి కృషిచేస్తా

పదవీ ప్రమాణ స్వీకారోత్సవంలో మార్కెట్ చైర్మన్ శ్రీనివాస్



నర్సంపేట వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో పదవీ బాధ్యతలు స్వీకరిస్తున్న చైర్మన్ పాలాయి శ్రీనివాస్, కమిటీ సభ్యులు

నర్సంపేట, ఆగస్టు 11 : నర్సంపేట నియోజకవర్గంలోని రైతులకు అండదండగా ఉంటూ వ్యవసాయ మార్కెట్ అభివృద్ధికి కృషిచేస్తానని మార్కెట్ కమిటీ చైర్మన్ పాలాయి శ్రీనివాస్ అన్నారు. పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో ఆదివారం మార్కెట్ కమిటీ సభ్యులతో కలిసి చైర్మన్‌గా ఆయన పదవీ ప్రమాణ స్వీకారంచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి సహకారంతో సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సహకారంతో వ్యవసాయ మార్కెట్ పరిధిలోని ఆయకట్టు రోడ్ల నిర్మాణానికి తనవంతు కృషి చేస్తానన్నారు.

కమిటీ సభ్యుల సహకారంతో మార్కె ట్ అభివృద్ధికి పాటుపడడంతోపాటు రైతులకు మార్కెట్‌లో ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో వ్యవసా య మార్కెట్ వైస్ చైర్మన్ శాఖమూరి హరిబాబు, కమిటీ సభ్యులు బొల్లు రమేశ్, కొల్లూరి మధుకర్, చీర అశోక్, కొరె కుమారస్వామి, హింగె రామా రావు, చిల్లూరి జ్యోతి, అజ్మీర దంజ్య, డక్క శ్రీనివాస్, సలాద్దిన్ అయూబ్‌ఖాన్, గట్టి సారంగపాణి, స్వామిశెట్టి ప్రభాకర్, బండారి దామోదర్ ఇతర సభ్యుల తోపాటు మార్కెట్ కార్యదర్శి గుగులోతు రెడ్యానాయక్, ద్వితీయ శ్రేణి కార్యదర్శి సోమశేఖర్, సూపర్‌వైజర్ శివ, ఈట రమణ, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది సురేశ్, సతీష్, ఖయూమ్, ప్రసాద్, పీసీసీ సభ్యులు పెండెం రామానంద్, సొంటిరెడ్డి రంజిత్‌రెడ్డి పాల్గొన్నారు.

• చైర్మన్‌ను సన్మానించిన మహిళా కాంగ్రెస్ నాయకులు

నర్సంపేట వ్యవసాయమార్కెట్ చైర్మన్‌గా ఆదివారం పదవీబాధ్యతలు స్వీకరించిన పాలయిశ్రీనివాస్‌ను మహిళాకాంగ్రెస్ నాయకులు సన్మానించారు. మాజీ సర్పంచు చిలువేరు రజనీభారతి, ఆడెపు రమాదేవి, ఎస్‌కె.ఖాజాబీ తోపాటు మహిళానాయకులు, చిలువేరు రమేశ్‌తోపాటు కాంగ్రెస్ నాయకులు బొకె అందజేసి శాలువాకప్పి సన్మానించి అభినందనలు తెలిపారు.

• వైస్ చైర్మన్‌కు సన్మానం

ఖానాపురం: నర్సంపేట వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్‌గా మండల కేంద్రానికి చెందిన శాఖమూరి హరిబాబు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఖానాపురం, బుధరావుపేట, ధర్మరావుపేటలకు చెందిన కాంగ్రెస్ నాయకులు, అభిమానులు, శాలివాహన సంఘం బాధ్యులు హరిబాబును ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కొనకటి రాజు, చెడిపాక ఉపేందర్, మాజీ ఎంపీటీసీలు బల్గూరి విజాకర్‌రావు, దేవినేని జ్యోతివేణుగోపాల్‌రావు, లాల్‌సాబ్, చాంద్‌పాషా, ఖానాపురం శాలివాహన సంఘం అధ్యక్షుడు కుమార్, చలిగంటి సాంబయ్య, ఎలిజెర్ల బుచ్చయ్య, కొంరయ్య చలిగంటి మల్లిఖార్జున్, వెంకన్న, సదానందం పాల్గొన్నారు.

• డైరెక్టర్‌కు ఘన సన్మానం

చెన్నారావుపేట : మండల కేంద్రానికి చెందిన కోరే కుమారస్వామి అనే రైతు నర్సంపేట మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా ఎంపిక కావటం పట్ల మండల కాంగ్రెస్ నాయకులు. రైతులు హర్షం వ్యక్తం చేస్తూ ఆదివారం ఘనంగా సన్మానం చేశారు. ఆయనకు శాల్వను కప్పి, పుష్పగుచ్ఛాన్ని అందించారు. కార్యక్రమంలో పీసీసీ మెంబర్ రంజిత్‌రెడ్డి. మండల పార్టీ అధ్యక్షుడు భూక్య గోపాల్‌నాయక్, జిల్లా కార్యదర్శి మొగిలి వెంకట్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు సిద్దెన రమేష్, తప్పెట రమేష్, మాజీ ఎంపీపీ కేతిడి వీరరెడ్డి, నెక్కొండ బ్లాక్ కార్యదర్శి మంద యాకయ్యగౌడ్, మండల పార్టీ నాయకులు కుండె కుమారస్వామి, శ్రీనువాస్, తాళ్లపెల్లి నర్సయ్య, జోరు వీరయ్యగౌడ్, మండల యూత్ అధ్యక్షుడు బండి హరీష్, తోట రాము, కోల విజయ్ పాల్గొన్నారు.

14 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత



పోలీసులు పట్టుకున్న రేషన్ బియ్యం

దుగ్గొండి, ఆగస్టు 11 : మండలంలోని నాచినపల్లి, మహ్మదాపురం గ్రామాల్లో ఆదివారం అక్రమంగా 14 క్వింటాల రేషన్ బియ్యాన్ని తరలిస్తుండగా పట్టుకున్నట్లు ఎస్సై నీలోజు వెంకటేశ్వర్లు వెల్లడించారు. నాచినపల్లిలో లక్క నరేశ్ ట్రాలీలో 10 క్వింటాళ్ల రేషన్ బియ్యం, మహ్మదాపురంలో అల్లే మహేందర్ 4 క్వింటాళ్ల రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తుండగా పట్టుకొని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

కబడ్డీ క్రీడాకారులకు అండగా ఉంటా



రాంరెడ్డిని సన్మానించిన క్రీడాకారులు

దుగ్గొండి, ఆగస్టు 11 : కబడ్డీ క్రీడాకారులకు అండగా ఉండి క్రీడాకారులను ప్రోత్సహించి, రాష్ట్ర, జాతీయస్థాయిలో పాల్గొనే విధంగా చర్యలు తీసుకుంటామని జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్.రాంరెడ్డి అన్నారు. మండలంలోని నాచినపల్లికి చెందిన ఆర్.రాంరెడ్డి, జిల్లా అధ్యక్షుడుగా వెంకటాపురానికి చెందిన కక్కెర్ల మల్లికార్జున్ జిల్లా సహాయ కార్యదర్శిగా ఎంపిక కాగా, ఆదివారం మండలంలోని గిర్నిబావిలో ఏర్పాటు చేసిన అభినందన సభలో వారిని క్రీడాకారులు, పీఈటీ అసోసియేషన్ సభ్యులు సన్మానం చేశారు. ఈ సందర్భంగా రాంరెడ్డి మాట్లాడారు. సన్మాన సభలో కబడ్డీ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి అబ్దుల్లాఖాన్, మండల చైర్మన్ పుప్పాల ఎల్లయ్య, యాదగిరి, కుమారస్వామి, ఉమామహేశ్వర్‌రెడ్డి, జమాల్ పాషా, దోర్నాల రమేశ్, సమ్మలు, నర్సింహారెడ్డి, ఇటికాల దేవేందర్, జనార్ధన్‌రెడ్డి, కార్తిక్, వినోద్, రాజేందర్, పవన్, శరత్‌లు పాల్గొన్నారు.

ఘనంగా బోనాల వేడుకలు



ఉప్పరపల్లిలో బోనాలతో వెళ్తున్న మహిళలు

చెన్నారావుపేట, ఆగస్టు 11 : మండలంలోని పలు గ్రామాలల్లో శ్రవణ మాసంను పురస్కరించుకొని పోచమ్మ బోనాల పండుగ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. గ్రామంలోని పోచమ్మతల్లికి పాలు. బెల్లంతో చేసిన పరమాన్నంను ఆలయం వద్ద సమర్పించి తమ మొక్కులను చెల్లించుకున్నారు. అలాగే ఆలయంలో పసుపు. కుంకుమలతో పోచమ్మతల్లికి ప్రత్యేక పూజలను చేసి తమ మొక్కులను చెల్లించుకోవటం జరిగింది. ఈ కార్యక్రమంలో పలువురు మహిళలు, నాయకులు పాల్గొన్నారు.

• ఖానాపురం : మండల కేంద్రంలో గ్రామ దేవత పోచమ్మ బోనాల పండుగను సోమవారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలో ప్రతీ ఇంటినుంచి బోనాన్ని ఎత్తుకొని మహిళలు ఆలయానికి బయలేదేరి వెళ్లారు. పోచమ్మతల్లికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. వర్షాలు సంవృద్ధిగా పడి, పాడిపంటలతో అందరు సుఖసంతోషాలతో ఉండాలని పోచమ్మతల్లిని వేడుకున్నారు.

• పర్వతగిరి : బోనాల పండుగ వేడుకలను మండలంలోని అన్నారంషరీఫ్, చింతనెక్కొండ, ఏనుగల్లు గ్రామాల్లో బోనాల పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయా గ్రామాల ప్రజలు పోచమ్మ, ముత్యాలమ్మ దేవాలయాల వద్దకు బోనాలతో తరలివెళ్లి అమ్మవారికి బోనాలు సమర్పించారు.

• గీసుగొండ : మండల కేంద్రంలో పోచమ్మతల్లి బోనాల పండుగ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు భక్తిశ్రద్ధలతో బోనాలను తయారు చేసుకొని, పిల్లపాపలతో అమ్మవారి ఆలయానికి వెళ్లి మొక్కులు చెల్లించుకున్నారు. బంధువులను ఆహ్వానించి విందులు ఏర్పాటు చేయటంతో గ్రామం సందడిగా మారింది.

అక్రమంగా ఎస్సారెస్పీ మట్టి తరలింపు

• సెలవు దినం కావడంతో యథేచ్ఛగా రవాణా • ఓ ప్రజాప్రతినిధి అండదండలున్నాయని బుకాయింపు



టిప్పర్‌లో మట్టిని లోడ్ చేస్తున్న హిటాచీ

రాయపర్తి, ఆగస్టు 11 : రాయపర్తి శివారులోని ఎస్సారెస్పీ మట్టిని (మొరం) కొందరు అక్రమార్కులు యథేచ్ఛగా తరలిస్తున్నారు. ఆదివారం సెలవు దినం కావడంతో అధికారుల నజర్ ఉండదనే భావనతో భారీ హిటాచీలు, టిప్పర్ల సహాయంతో దూర ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఎస్సారెస్పీ కాలువకుసేఫ్ అండ్ సెక్యూరిటీ కోసం అధికారులు కాలువ పక్కనే మట్టిని నిల్వచేసి ఉంచారు. ప్రమాదాలు, విపత్తులు జరిగినప్పుడు మాత్రమే ఈ మట్టిని వినియోగించాల్సి ఉంటుంది. కానీ, నిబంధనలకు విరు ద్ధంగా అక్రమంగా ఎలాంటి అనుమతులులేకుండా మట్టిని తరలించడం పట్ల స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

• ఓ ప్రజాప్రతినిధి అండదండలు..

ఎస్సారెస్పీ కాలువ రాయపర్తి శివారుకు, అటు వర్ధన్నపేట పట్టణంలోని డీసీతండా శివారుకు దగ్గరంగా ఉంటోంది. ఎక్కువగా అక్కడి తండాలకు చెందిన వ్యక్తులే ట్రాక్టర్ల ద్వారా తరలిస్తుంటారు. తెల్లవారు జామున ఈ దందా మూడు పువ్వులు, ఆరు కాయలుగా వర్ధిల్లుతోంది.కానీ, ఆదివారం దానికి భిన్నంగా టిప్పర్ల సహకారంతో రవాణా కావడం పట్ల స్థానికులు ప్రశ్నించారు. దీంతో అక్రమ నిర్వాహకులు మాకు ఓ ప్రజాప్రతినిధి అండదండలు ఉన్నాయని, ఓ పట్టణ చైర్మన్ తండ్రి దీన్ని నడిపిస్తున్నాడని బుకాయించారు. అనుమతులు తీసుకునేందుకు సిద్ధంగా ఉన్నామని, కానీ, తరలింపు తర్వాత పర్మిషన్లు తీసుకుంటారా అని ప్రశ్నించిన వారిపై దురుసుగా ప్రవర్తిస్తున్నారు. దీంతో అధికార పార్టీ ప్రజాప్ర తినిధులు అక్రమ మట్టి వ్యాపారాన్ని ప్రోత్సహి స్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఎస్సారెస్పీ ఉన్నతాధికారులు దీనిపై దృష్టి సారించక పోవడానికి సైతం వీరే కారణమనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.



మట్టిని తరలిస్తున్న టిప్పర్

దూర విద్య డిగ్రీ, పీజీ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

గీసుగొండ, ఆగస్టు 11 : కాకతీయ యూనివర్సిటీ దూరవిద్య ద్వారా డిగ్రీ కోర్సులు బీఏ, బీకాం, బీఎస్సీ, బీబీఎలు, పీజీ కోర్సులు ఎం.ఏ, ఎంకాం, ఎమ్మెస్సీ, ఎంహెచ్ఆర్ఎం, ఎమ్మెస్‌డబ్ల్యు ఎంఎల్ఐసీలలో ప్రవేశానికి ఈ నెల 31వరకు దరఖాస్తులు చేసుకోవచ్చని అధ్యయన కేంద్రం కో ఆర్డినేటర్ కొక్కొండ శ్రీకాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. అదేవిధంగా సంవత్సరంలో డీసీఏ, ఆరు నెలల సీఎల్ఐసీ, కోర్సుల్లో కూడా అడ్మిషన్‌లు పొందవచ్చని చెప్పారు. డిగ్రీ కోర్సులకు ఇంటర్, పీజీ కోర్సులకు డిగ్రీ పూర్తి చేసిన వారు అర్హులు అని ఆయన వివరించారు. మరిన్ని వివరాలకు 99635 91463 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

జర్నలిస్టుల శాంతి ర్యాలీ

చెన్నారావుపేట, ఆగస్టు 11 : ఓ యూట్యూబ్ ఛానల్ రిపోర్టర్ ఆత్మహత్య చేసుకోవడంపై సంతాపం వ్యక్తం చేస్తూ మండలంలో పనిచేసే జర్నలిస్టుల ఆధ్వర్యంలో ఆదివారం మండల కేంద్రంలో శాంతి ర్యాలీ చేపట్టారు. గ్రామంలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించిన అనంతరం ఆయన చిత్ర పటం వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల రిపోర్టర్‌లు పడిదం శోభన్‌బాబు. ఎంఏ వహీద్, ఆకుల అశోక్, దొంతి సుమన్, రాంమోహన్‌చారి. ముత్యం రాజు, కుండె కర్ణాకర్, చంద్రమోహన్, నర్సింహా, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

బొజ్జా తారకం వర్ధంతి సభలను విజయవంతం చేయాలి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఆర్‌పీఐ(బి)నాయకులు

నర్సంపేట, ఆగస్టు 11 : సెప్టెంబరు 16 నుంచి 30 వరకు రా ష్ట్ర వ్యాప్తంగా జరుగనున్న ప్రజా ఉద్యమ నాయకుడు, హక్కుల నేత బొజ్జాతారకం 8వ వర్ధంతి వేడుకలను విజయవంతం చేయాలని ఆర్‌పిఐ(బి) రాష్ట్ర అధ్యక్షుడు జన్ను సాంబయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంకేశ్వరపు రమేశ్ పిలుపు నిచ్చారు. పట్టణంలో బొజ్జా తారకం వర్ధంతిని విజయవంతం చేయాలని కోరుతూ ముద్రించిన కరపత్రాలను ఆదివారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌పిఐ(బి) ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి గునిగంటి రమేశ్, జిల్లా ఉపాధ్యక్షుడు ఎడ్ల రవి, జిల్లా కార్యదర్శి తారల శంకర్, జిల్లా ప్రచార కార్యదర్శి ఎండి.షాహిదాబేగం, గుగులోతు సోనమ్మ పాల్గొన్నారు.

మాదిగ కార్పొరేషన్ ద్వారా రుణాలు ఇవ్వాలి

నెక్కొండ, ఆగస్టు 11 : ప్రత్యేకంగా మాదిగ కార్పొరేషన్ ఏర్పాటుచేసిన రాష్ట్ర ప్రభుత్వం మాదిగల జీవనోపాధికి రుణాలను అందించాలని నర్సంపేట డివిజన్ ఎమ్మార్పీఎస్‌టీఎస్ నాయకులు వద్దురి కుమారస్వామి డిమాండ్ చేశారు. ఆదివారం నెక్కొండలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎస్సీల సంక్షేమం కోసం ప్రభుత్వం వార్షిక బడ్జెట్‌లో కేటాయించిన నిధిలో కొన్ని నిధులను కార్పొరేషన్‌కు కేటాయించాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా 12769 గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు ఉద్యోగ భద్రతను కల్పించాలన్నారు. మాదిగలకు 1978లో ప్రభుత్వం పంపిణీ చేసిన పంచరాయి, పోరంబోకు భూములను చదును చేసుకోనుటకు రుణాలు అందించాలని కోరారు.


వెంకటాపురంలో సోలార్ లైట్లు ప్రారంభం



సోలార్ లైట్లను ప్రారంభిస్తున్న రంజిత్‌రెడ్డి

నెక్కొండ, ఆగస్టు 11 : మండలంలోని వెంకటాపురంలో నర్సంపేట టీపీసీసీ మెంబర్ సొంటిరెడ్డి రంజిత్‌రెడ్డి, నెక్కొండ వ్యవసాయ మార్కెట్‌చైర్మన్ రావుల హరిష్‌రెడ్డిలు ఆదివారం సాయంత్రం సోలార్ లైట్లనుప్రారంభించారు. గ్రామాలను అన్ని రంగాల్లో అభివృద్ధి పర్చడం రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమన్ని అందుకోసం కోట్ల రూపాయల అభివృద్ధి నిధులను మంజూరీ చేస్తున్నట్లు వారు తెలిపారు. ఈ సోలార్ లైట్లను మండల పరిషత్ నిధులు రూ. 1.60లక్షలతో ఏర్పాటు చేశారని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బక్కి అశోక్, నాయకులు కుసుమ చెన్నకేశవులు, చల్లా శ్రీపాల్‌రెడ్డి, రాచకొండ రఘు, వంగాల బాబు, మల్లయ్య, వీరన్న, బండారుపల్లి శ్రీనివాసరావు, శేషగిరి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినికి ల్యాప్‌టాప్ అందజేత



గడ్డం శృతికి ల్యాప్‌టాప్‌ను అందిస్తున్న కటకం శ్రీనివాస్

వర్ధన్నపేట రూరల్, ఆగస్టు 11 : మండలంలోని దమ్మన్నపేటకు చెందిన గడ్డం శృతి అనే విద్యార్థినికి ఆత్మీయ ట్రస్ట్‌కు చెందిన కటకం శ్రీనివాస్ ఆదివారం ల్యాప్‌టాప్ అందించారు. గడ్డం శృతి స్థానిక ప్రభుత్వ పాఠశాల, ప్రభుత్వ కళాశాలలో చదివి ఉత్తీర్ణత సాధించింది. ఆమె తండ్రి చిన్నతనంలో మరణించగా, తల్లి అన్నీ తానై చదివించింది. నీట్‌లో శృతి మంచి ర్యాంకు సంపాదించి ఖమ్మంలోని మమత మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ సీటు సంపాదించగా, ఖర్చులు భరించే స్తోమత లేకపోవడంతో దాతలు ముందుకు వచ్చి శృతి విద్యకు అయ్యే ఖర్చును భరిస్తున్నారు. రెండో సంవత్సరంలోకి అడుగు పెట్టిన శృతికి వైద్య విద్యలో ల్యాప్‌టాప్ అవసరం పడింది. దీంతో నిజామాబాద్‌కు చెందిన ఆత్మీయ ట్రస్టు సభ్యుడు రూ.54 వేల విలువ గల ల్యాప్‌టాప్‌ను అందించి ఔదార్యాన్ని చాటుకున్నాడు. దీంతో విద్యార్థిని, ఆమె తల్లి ఆనందం వ్యక్తం చేశారు.

పీఏసీఎస్‌లో పోలీసుల తనిఖీలు



పీఏసీఎస్‌లో తనిఖీలు చేస్తున్న పోలీసులు

నల్లబెల్లి, ఆగస్టు 11 : నల్లబెల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో దుగ్గొండి రూరల్ సీఐ రాజగోపాల్ ఆధ్వర్యంలో ఆదివారం తనిఖీలు చేపట్టారు. పీఏసీఎస్‌లో సభ్యత్వం ఉన్నవారు, తీసుకున్న రుణం కన్నా ఎక్కువ రుణం పొందినట్లు రికార్డులో ఉందని సీఐ రాగోపాల్ విలేకరులకు తెలిపారు. సభ్యత్వం లేని రైతుల ఆధార్ కార్డు నెంబర్లతో పీఏసీఎస్‌లో సొసైటీ సిబ్బంది రుణాలను పొందినట్లు రికార్డులలో నమోదై ఉందన్నారు. సొసైటీ లెజండ్రి రికార్డు బుక్కుల్లో నమోదైన రైతుల రుణాల్లో అవకతవకలు ఉన్నాయని ఆయన తెలిపారు. సొసైటీలో రూ.లక్ష, రూ.లక్షకు పైగా రుణాలు పొందినట్లు ఉన్న మండలంలోని రైతుల వద్దకు నేరుగా వెళ్లి కలుస్తామన్నారు. వారి నుంచి సేకరించిన సమాచారంతో తదుపరి చర్యలు చేపడతామని తెలిపారు. సహకార సంఘంలో సమగ్ర వివరాలు తెలియాలంటే కొంత సమయం పడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో నల్లబెల్లి ఎస్సై ప్రశాంత్‌బాబు, దుగ్గొండి ఎస్సై వెంకటేశ్వర్లు, ఖానాపూర్ ఎస్సై రఘుపతి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

స్వయం ఉపాధి మార్గాలను ఎంచుకోవాలి

రాయపర్తి, ఆగస్టు 11: ప్రతీ ఒక్కరు స్వయం ఉపాధిమార్గలను ఎంచుకోవాలని మాజీ మంత్రి ఎర్రబెల్లిదయాకర్‌రావు అన్నారు. ఆదివారం మండలంలోని మైలారంలో మాజీ ఎంపీటీసీ బిల్లా రాధిక సుభాష్‌రెడ్డిల కోళ్ల ఫామ్‌ను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రాజకీయాలు ఎన్నికల సమయంలో మాత్రమేనని, కుటుంబ అవసరాల కోసం, జీవనోపాధి కోసం ప్రతీ ఒక్కరు పనులుచేసుకోవాలని తెలిపారు.

గీత కార్మికులకు ఈత మొక్కల పంపిణీ

పర్వతగిరి, ఆగస్టు 11 : మండల కేంద్రంతో పాటు కల్లెడ, బూర్గుమళ్ల గ్రామాల్లోని గీతకార్మికులకు ఎక్సైజ్ అధికారులు ఆదివారం ఈత మొక్కలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వర్ధన్నపేట ఎక్సైజ్ సీఐ స్వరూప మాట్లాడుతూ గీత కార్మికులు ఆయా గ్రామాల్లోని తాటివనాలు, ఈతవనాల్లో ఈతమొక్కలను నాటి పెంచాలన్నారు. తద్వారా పచ్చదనం పెరగడమే గాకుండా గీత కార్మికులకు కల్లు విక్రయం ద్వారా ఆర్థికంగా సహకారం అందుతుందన్నారు. ప్రస్తుత కాలంలో తాటి, ఈతవనాలు కనుమరుగు అవుతున్నాయని, ప్రభుత్వం, అధికారులు అందించే వృక్షాలను నాటి వనాలను తిరిగి పెంపొందించుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో గీతకార్మికులు కుమార్, వెంకన్న, సారయ్య, ఐలయ్య, రమేష్ పాల్గొన్నారు.

యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా రాజు



ఖానాపురం, ఆగస్టు 11: యూత్‌కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా రాగంపేట గ్రామానికి చెందిన ఎలగందుల రాజును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆదివారం యువజన కాంగ్రెస్ రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ మోడెం ఎల్లగౌడ్‌తో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు రాజును ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మండల యూత్ ఉపాధ్యక్షుడు పల్లు ప్రశాంత్, మొలకల మొగిళి, మేకల రాజు, మనీష్, హరీష్, వినయ్, మల్సూర్ తదితరులు పాల్గొన్నారు.

కీర్తినగర్‌లో వ్యక్తి అదృశ్యం



రాజు

గీసుగొండ, ఆగస్టు 11 : 16వ డివిజన్ కీర్తినగర్‌కు చెందిన కొంపెల్లి రాజు(47) కనబడకుండా పోయినట్లు అతడి భార్య లలిత ఆదివారం గీసుగొండ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఈ నెల 10న రాజు ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో పలు చోట్ల వెతికి, బంధువులు, అతడి స్నేహితుల వద్ద వాకబు చేసినా ఆచూకీ తెలియలేదు. రాజు భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ బాబులాల్ తెలిపారు.

ఎస్సీ, ఎస్టీలకు కంప్యూటర్ విద్యను ఉచితంగా అందించాలి

వర్ధన్నపేట, ఆగస్టు 11: ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఎస్సీ, ఎస్టీలకు కంప్యూటర్ విద్యను ఉచితంగా అందించాలని దళిత నిరుద్యోగ సంక్షేమ సంఘం (డీఎస్ఎస్ఎస్) రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల కుమారస్వామి డిమాండ్ చేశారు. ఆదివారం వర్ధన్నపేట మండల కేంద్రంలో డీఎస్ఎస్ఎస్ రాష్ట్ర కార్యదర్శి కంజర్ల సమ్మయ్య అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో కంప్యూటర్ విద్యకు కేంద్ర ప్రభుత్వం 75 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 25 శాతం బడ్జెట్‌ను కేటాయించాలని అన్నారు. ఈ సమావేశంలో డీఎస్ఎస్ఎస్ జిల్లా నాయకులు మరుపట్ల కుమారస్వామి, మునిగాల అరుణ్, చిన్నపల్లి బాబు తదితరులు పాల్గొన్నారు.

కట్టమైసమ్మ విగ్రహం పునః ప్రతిష్ఠాపన

వర్ధన్నపేట, ఆగస్టు 11 : మండలంలోని కోనారెడ్డి చెరువు కట్టపై ఉన్న మైసమ్మ తల్లి విగ్రహాన్ని పునః ప్రతిష్ఠాపన ఆదివారం చేశారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజుతోపాటు కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ నేత నిమ్మాని శేఖర్ రావు, మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్ వేర్వేరుగా సందర్శించారు. మైసమ్మ తల్లికి ప్రత్యేక పూజలు చేసి కొలిచారు. కార్యక్రమంలో కోనారెడ్డి చెరువు ఆయకట్టు రైతులు అదిక సంఖ్యలోపాల్గొన్నారు.